
అత్యధిక పాఠక అదరణ పొందుతున్న ఆధ్యాత్మిక పత్రిక

ప్రపత్తి


# శ్రీసన్నిధానం

ఆధ్యాత్మిక మాస పత్రిక

కరీంనగర్ సంపుటి: 01 సంచిక: 02 ఏప్రిల్ 2024 పేజీలు:36 వెల:30



ఉగాది మరియు శ్రీరామ నవమి శుభాకాంక్షలు



# ముఖచిత్రపరిచయం

తెలుగు వారి తొలిపండుగ ఉగాది. చైత్రశుక్లపాడ్యమినాడు బ్రహ్మ సృష్టి ఆరంభించిన సంకేతంగా ఉగాది జరుపుకోవడం ప్రారంభించారు. ఉగాది అంటే ప్రత్యేకమైన పచ్చడిగుర్తుకు వస్తుంది. ధర్మాన్ని ఆచరించమని ఉగాది పండుగ పరమార్థాన్ని తెలియజేస్తుంది. షోడష గుణాలు మూర్తీభవించిన రాములోరి ఉత్సవాలతో నూతన సంవత్సరంలో పండుగల సమాహారం ప్రారంభం. తీపి, పులుపు, ఉప్పు, కారం, వగరు, చేదు ఈ షడ్రుచులు జీవన పరమార్థాన్ని పరోక్షంగా తెలియజేస్తాయి. "రామో విగ్రహవాన్ ధర్మః" అంటూ షోడష గుణాలు గల గుణవంతుడు. శౌర్యం, ధర్మ జ్ఞానం, కృతజ్ఞత, సత్యం, అచంచలమైన సంకల్పం, అద్భుతమైన ప్రవర్తన, అన్ని ప్రాణుల పట్ల కరుణ, జ్ఞానం, గొప్ప పనులు చేయగల సామర్థ్యం, ఆహ్లాదకరమైన రూపం, స్వీయ నియంత్రణ, కోపంపై అదుపు, మెరిసే తేజస్సు, అసూయ లేకపోవడం, దేవతలను కూడా భయపెట్టే శక్తి కలిగిన శ్రీరాముడంటే మనకందరికీ ఆదర్శం. ఎల్లప్పుడు శుభాలే కలుగాలని ఆశిస్తూ, శ్రీరామనవమి, ఆ తరువాత శ్రీసీతారాముల కళ్యాణం, పట్టాభిషేక మహోత్సవం తెలుగువారు జరుపుకుంటారు. మంచి జరుగాలంటే శ్రీరామపట్టాభిషేకం జరుపుకోవడం కూడా పరిపాటి. పాఠకలోకానికి అనునిత్యం శుభాలు కలుగాలన్న కాంక్షతో డింగిరి సంపత్‌కుమార్ కుంచే నుంచి జాలువారిన ముఖచిత్ర దృశ్యమిది.

# గమనిక

ప్రపత్తి శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాస పత్రికకు సలహాలు, సూచనలు, చందాదారుల చిరునామా మార్పులు, నూతన చందాదారులు కావడానికి ఇ-మెయిల్ ద్వారా తెలియజేయవచ్చును.

help desk:

prapatti.srisannidhanam9@gmail.com

మాస పత్రిక చందా వివరముల గురించి సంప్రదించవలసిన హెల్ప్ డెస్క్ నెంబర్:

9502583323

(ఉదయం 9 గం. నుండి రాత్రి 9 గం. వరకు)

## సంప్రదించండి

పాఠకుల సందేహాలు, సమాధానాలు జ్యోతిష్య శాస్త్ర విశేషాల కొరకు వెంటనే సంప్రదించండి.

**మా ఈ చిరు ప్రయత్నాన్ని స్వాగతించండి!!**

**మీసందేహాలను నివృత్తి చేసుకోండి!!**

-మేనేజింగ్ ఎడిటర్

## ముఖ్య గమనిక

ప్రపత్తి శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాస పత్రిక ఈ సంచికలో ప్రచురించిన రచనలలోని భావాలు ఆయా రచయితలవే, రచన సారాంశము రచయిత అభిప్రాయముగా భావించవలెను. ఈ రచనల భావంతో సంపాదకునికి, ట్రస్ట్‌నకు ఎటువంటి బాధ్యత లేదని పాఠకులు గమనించవలసినదిగా మనవి.

- ఎడిటర్

ప్రపత్తి శ్రీసన్నిధానం

https://srisannidhanam.org

prapatti.srisannidhanam9@gmail.com

సంపుటి: 1 - సంచిక: 2 ఎడిటర్ : డింగిరి శ్రీనివాసమూర్తి ఏప్రిల్ 2024 వెల : 30

ఇందులో

3. ముఖచిత్రపరిచయం

4. సంపాదకీయం
శ్రీమాన్ శ్రీ వొద్దిపర్తి రామచంద్రమూర్తి

5. నెలవారి పంచాంగం

6. శ్రీరామానుజ సుధామాధురి
శ్రీమతి సముద్రాల శారద

9. భూలోకవైకుంఠం భద్రాచల క్షేత్రం ప్రత్యేకం
శ్రీమాన్ శ్రీ కె.ఇ.స్థలశాయి

11. శ్రీపతిస్తుతి
శ్రీమాన్ శ్రీ అమరవాది
వేంకటనర్సింహాచార్యులు

12. ఆచార్య వైభవవమ్
శ్రీమాన్ శ్రీ డా ఈ.ఎ. శింగరాచార్యస్వామి

13. శుభాశుభ నిర్ణయాలు-మీమాంస
శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల
సంపత్కుమార కృష్ణమాచార్య

15. భాగవతంలో భగవంతుని కథలు
శ్రీమతి తిరుమల నీరజ

17. సత్సంప్రదాయ పరిరక్షణ సభ

18. కౌసల్య మాత మందిరం
శ్రీమాన్ శ్రీ డా.వోలేటి రవికుమారాచార్యులు

19. విదురుని ధర్మనిష్ఠ
శ్రీమతి మహాలక్ష్మి రాణి గుండు

21. శ్రీమత్ క్రోధి నామ సం॥ ఫలితాంశాలు
శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల
సంపత్కుమార కృష్ణమాచార్య

22. జ్యోతిర్విజ్ఞానమ్
శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక

23. భరన్యాసము-భగవంతునిపై భారము
శ్రీమతి వంగల రాధిక

24. శ్రీరామాయణంలో ఉపకథలు
శ్రీమతి చక్రవర్తుల చూడామణి

26. అవయవ విభూతి
శ్రీమతి కొడకళ్ళ పద్మజ జోతిర్మయి

28. ఉభయ వేదాన్త ఐక కంఠ్యము
శ్రీమాన్ శ్రీ అప్పన్‌కందాడై శ్రీనివాసాచార్యులు

30. సంభాషణా చాతుర్యం
శ్రీమాన్ శ్రీ శ్రీభాష్యం జగన్నాథాచార్యులు

**సంపాదక మండలి**

వొద్దిపర్తి రామచంద్రమూర్తి చీఫ్ ఎడిటర్
సముద్రాల శారద వొపీనియన్ ఎడిటర్
డింగిరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్

**గౌరవ సంపాదకులు**

శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక
శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి ఆచార్య
శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనర్సింహాచార్యులు

నోట్:- సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు మీరూ మాతో కలిసినడువండి! అంతర్జాలంలో పబ్లిష్ చేసేవారు 'శ్రీసన్నిధానం సంచిక నుంచి సేకరణ' అని రాయడం మరువకండి!! కాపీ రైట్ చట్టానికి కట్టుబడి ఉందాం.

# సంపాదకీయం



# జాతి జాగృతానికి అంతఃకరణ శుద్ధి

భారత జాతిని జాగృతపరిచే విధంగా ప్రయత్నాలు ఎందరో చేస్తున్నారు. ఇందులో భాగంగా సనాతన సంప్రదాయ పరిరక్షణ కోసం, ధర్మ పరిరక్షణ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే వీటన్నిటిని గమనించి ముందుకు వెళుతున్నది ఎవరు? వీటివల్ల జాతి మొత్తం జాగృతం అవుతుందా? అయితే జాతి జాగృతానికి, చైతన్యానికి ఏంచేయాలన్నదే ప్రశ్న. ఆలయ నిర్మాణం కోసం జనం కదిలారు. జాగృతమయ్యారు. కానీ వాస్తవాన్ని అంగీకరించి ఆతర్వాత ఒకత్రాటిపై నిలువడానికి ముందుకు రావడంలేదు. ఎందుకంటే సెక్యులర్ ముసుగు తొలగించడానికి అంతాసిద్ధంగా లేరు. మేకవన్నె పులుల ముందు మోకరిల్లాల్సిన అవసరం ఉందికదా అనిలోలోన భయం వెన్నాడుతోంది. ముందుగా దేశంలో ఐకమత్యం సిద్ధించాలి. అంతఃకరణ శుద్ధితో మనం చేస్తున్న పని మంచిదన్న భావన కలగాలి, ఆ విషయాన్ని అందరికీ అవగతం అయ్యేలా అంతటా వ్యక్తీకరించే సామర్థ్యం మనలో కలగాలి. అలా నిలువగలిగినప్పుడే ప్రతి అంశంలో మనం విజయం సాధించ గలుగుతాం. ఈ విషయంలో ప్రభుత్వాలు కానీ, పాలకులు కానీ మనవెంటరాకున్నా మంచిపని ఏదైనా పూర్తి చేయడానికి యువత మాత్రమే కదిలితే సరిపోదు. చిన్నాపెద్దా అందరూ సంఘటితమవ్వాలి. నిత్యం మన చుట్టూ జరుగుతున్న వాస్తవాన్ని ఒకమారు గమనించండి. పర్యావరణ పరిరక్షణ, తినే ఆహారం కలుషితం కాకుండా చూడటం, ఆధ్యాత్మిక భావనలు పరిఢవిల్లేలా పనులు చేపట్టడం లాంటివి చేయాలి. అత్యాధునికత ముసుగులో మనపై జరుగుతున్న ప్రత్యక్ష పరోక్ష దాడిని ప్రతిఘటించ గలుగుతున్నామా? పసిగట్టగలుగుతున్నామా? వాస్తవాన్ని తెలియజేప్పేందుకు గతంలో చక్కని రచనలు వచ్చేవి. జనం పక్కదారి పట్టకుండా చైతన్య పరిచేవారు. నిజాన్ని నిర్భయంగా చెప్పేవారు, ఆచరించేవారు కూడా. ప్రస్తుతం వస్తున్న రచనలవైపు యువత గమనించే అవకాశం లేకుండా పోయింది. ఎక్కువ సమయం మొబైల్‌తోనే గడిపేస్తున్నారు. పుస్తకం హస్త భూషణం గతం మాట! ప్రస్తుతానికి పుస్తకం స్థానే మొబైల్ వచ్చింది. మెదడుకు మేత జనరల్ నాలెడ్జ్ మాట మరిచిపోతున్నారు. మొబైల్ కాస్త పక్కన పెట్టారంటే టీవీ ముందు కూర్చుండి పోతున్నారు. కన్యాశుల్కం నాటకంలో గిరీశం అన్నట్లు 'అన్నీ పుస్తకాల్లో ఉన్నాయష' నాటి మాట 'అన్నీ మొబైల్లో ఉన్నాయి అన్నది నేటి మాట'. టీవీ సీరియల్స్ చూస్తూ తన్మయులవుతున్నారు. వాస్తవానికి వచ్చి చూస్తే, మన ఇంట్లో వాళ్లు అలా ప్రవర్తించరు. అంతా కుట్రలు కుతంత్రాలే! నేరంచేయడానికి మార్గాలు వెతకనక్కరలేదు. పదినిముషాలు గమనిస్తేచాలు అన్న చందం. ఇక ఈ విషయం పక్కన పెడుదాం. ఆకర్షణకోసం గుర్తింపుకోసం ఇంటర్‌నెట్ వేదికగా ఎన్నో జిమ్మిక్కులు కథా కమామీషులు, అభూతకల్పనలు వాస్తవానికి దూరంగా వెళుతున్నట్లు లేదూ! మనం చేస్తున్న ప్రతి పని మంచా? చెడా? దీనివల్ల భవిష్యత్ తరాలవారికి ఏమైనా ప్రయోజనం ఉందా? అని ఆలోచిస్తూ ముందడుగు వేయాలి. అందరూ విమర్శించే వారే ఆలోచన ఆచరణలో పెట్టేది ఎందరు? ఉదాహరణకు ఒక్కక్షణం వాస్తవంలోకి వద్దాం. వేసవికాలం బయట కొద్దిసేపు నాలుగు అడుగులు వేస్తే దాహం వేస్తుంది. ఆ వెంటనే వీధి మలుపులోని కొట్టులో మంచినీటికోసం ప్లాస్టిక్ వాటర్ బాటిల్ కొని చల్లని నీరు తాగాము హమ్మయ్య అని ఒక్కక్షణం ప్రాణం లేచివచ్చినట్లయింది. ఆవెంటనే ఆ ఖాళీ బాటిల్ రోడ్డు పైన పారవేస్తాం. ఇదంతా సహజంగా జరిగేదే కానీ మనం చూస్తున్న కోణంలో తప్పుజరిగి పోయిందే అనిపిస్తుంది. ప్లాస్టిక్ బాటల్స్ వ్యర్థం సరైన ప్రదేశంలో వేయకపోవడంవల్ల అనర్థం జరుగుతుందే అనిపిస్తుంది. దీనిని దృశ్యంగా చిత్రీకరించి టీవీలో ప్రసారం జరిగిందే అనుకోండి అప్పుడు జరిగిన జరుగుతున్న తప్పును గ్రహిస్తాం. ఆచరణ విషయానికి వస్తే ఆలోచించిన వారు అందరూ ఆచరించాలని లేదు. ఇలా నిత్య జీవితంలో ఎన్నో విషయాలు... అంతఃకరణ శుద్ధి చిత్తశుద్ధి కనుమరుగు అవుతున్నదన్నది వాస్తవం. నేటి నుంచి మనమంతా మనకోసం, మన దేశంకోసం, రేపటితరం భవిష్యత్తుకోసం జీవిద్దాం! అని అనుకుంటూ జాతి జాగృతి కోసం ముందుగా మన ఇంటి నుంచే ప్రయత్నాలకు శ్రీకారం చుడదాం. దీని వల్ల ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించే ప్రయత్నం చేద్దాం.

–ఔద్వపర్తి రామచంద్రమూర్తి (చీఫ్ ఎడిటర్)

# నెలవారి పంచాంగమ్

చైత్ర మాసం 09-04-24 శుక్లపక్షంతో ప్రారంభమై 08-05-24 వరకు, తదుపరి 09-05-24 నుండి వైశాఖ మాసం

13-04-24 నుండి 26-04-24 వరకు అశ్విని కార్తి, 27-04-2024 నుండి 11-05-24 వరకు భరణి కార్తి,

**పండుగలు** : 05-04-24 సర్వేషాం ఏకాదశి, 09-04-24 ఉగాది (తెలుగు సంవత్సరాది), 12-04-24 లక్ష్మీ పంచమి, 17-04-24 శ్రీరామ నవమి, 19-04-24 సర్వేషాం ఏకాదశి, 23-04-24 హనుమద్విజయోత్సవము, 27-04-24 సంకష్టహర చతుర్థి, 29-04-24 నుండి శుక్రమౌఢ్యమి,

## మాస ఫలాలు



**మేషం:** ఈ నెల చేయు వృత్తివ్యాపారాలు అంతగా రాణించవు. పనులందు ఆటంకములు, ఆదాయము నకు మించిన ఖర్చులు.



**వృషభం:** ఈ నెలలో చేయువృత్తి వ్యాపారాలందు రాణింపు. ఆరోగ్యం బాగుండును. ఆదాయమునకు లోటుండదు. ధైర్యంతో ముందుకు పోగలరు.



**మిథునం:** అన్నిరంగాలవారికి అనుకూలమే. పట్టిందల్లా బంగారమా అనునట్లుండును. కుటుంబంలో మీ మాట చెలామణి అగును. ఆర్థిక లావాదేవీలు సంతృప్తి సంతానం ద్వారా సౌఖ్యం.



**కర్కాటకం:** అన్నిరంగాలవారికి రాణింపు ఉంటుంది. వృత్తివ్యాపారాలు అనుకూలించును. ఆదాయం బాగుంటుంది. ఆరోగ్య లాభం.



**సింహం:** ఈ నెలలో అనుకూలంగా లేదు. ప్రతీవిషయంలో వ్యతిరేకత, శారీరక శ్రమ, కుటుంబంలో అశాంతి, స్థానమార్పులు.



**కన్య:** చేయు వృత్తి వ్యాపారాలందు ఇబ్బందులు. ఆరోగ్య, ఆర్థిక నష్టాలు, శారీరక శ్రమ, వ్యవహార భంగాలు, సంతానం ద్వారా సమస్యలు,



**తుల:** అన్నిరంగాలందు యోగమే. చేయు వ్యాపారాలందు రాణింపు, ఆరోగ్యం బాగుండును. ఆర్థిక లావాదేవీలు సంతృప్తి.



**వృశ్చికం:** ప్రతి విషయంలో పట్టుదల, ఆరోగ్యవిషయంలో జాగ్రత్త. ఆదాయంనకు పర్వాలేదు. శత్రువులవల్ల ఇబ్బందులు. మాసాంతంలో పనులు పూర్తి



**ధనుస్సు:** అన్నిరంగముల వారికి యోగమే. చేయువృత్తి వ్యాపారములందు రాణింపు, ఆరోగ్యలాభం, ఆదాయం నకు లోటుండదు. వ్యవహారానుకూలత, వాహనసౌఖ్యం, సంతానసౌఖ్యం,



**మకరం:** మీమాటకు ఎదురుండదు. పనులుపూర్తి చేసుకొంటారు. ఆరోగ్యం బాగుంటుంది. కోర్టు వ్యవహారాలు అనుకూలించును. గృహనిర్మాణాలు కలసివచ్చును.



**కుంభం:** అన్నిరంగాలందు అనుకూలమే. ఆరోగ్యం బాగుండును. గతంలో ఉన్న సమస్యలు తొలగును. గృహంలో శుభమూలక ధనవ్యయం,



**మీనం:** చేయు వృత్తివ్యాపారాలందు రాణింపు ఉంటుంది. ఆర్థిక సంతృప్తి. ఆరోగ్యం బాగుండును. వ్యవహారములు మీకు అనుకూలంగా సిద్ధించును.

### స్వస్తిశ్రీ క్రోధి నామ సంవత్సర

| రాశి | ఆదాయం | వ్యయం | రాజపూజ్యం | అవమానము |
|---|---|---|---|---|
| మేషం : | 8 | 14 | 4 | 3 |
| వృషభం: | 2 | 8 | 7 | 3 |
| మిథునం: | 5 | 5 | 3 | 6 |
| కర్కాటకం: | 14 | 2 | 6 | 6 |
| సింహం: | 2 | 14 | 2 | 2 |
| కన్య: | 5 | 5 | 5 | 2 |
| తుల: | 2 | 8 | 1 | 5 |
| వృశ్చికం: | 8 | 14 | 4 | 5 |
| ధనుస్సు: | 11 | 5 | 7 | 5 |
| మకరం: | 14 | 14 | 3 | 1 |
| కుంభం: | 14 | 14 | 6 | 1 |
| మీనం: | 11 | 5 | 2 | 4 |

### మంచి రోజులివిగో...

ఈనెల వివాహ, గృహారంభ, గృహప్రవేశ శుభ ముహూర్తములు **18,19,20,21,24.**

# శ్రీరామానుజ సుధామాధురి

## ప్రపన్నసుందరం - ప్రసిద్ధ గురువందనం



- శ్రీమతి సముద్రాల శారద

లోకంలో కొన్ని కార్యాలు మహాద్భుతాలుగా జరిగిపోతాయి. భావితరాలకు, మానవజాతికి ఆదర్శ భూతం అయ్యేలా చరిత్రపుటల్లో నిలిచిపోతాయి. "శ్రేయాంసి బహు విఘ్నాని" అని సమాజానికి మంచి చేసే కార్యాలకు విఘాతాలు కలుగవచ్చును. అయితే కొన్ని కార్యాలు దేవతా సానుకూల్యతతో దోషాలు తొలగి సాధింపబడతాయి. మరికొన్ని భగవద్ అనుగ్రహంతో సాఫల్యం పొందుతాయి. కొన్ని మాత్రం భగవత్ సంకల్పంతోనే కార్యం, కారణం కూడా సృష్టింపబడతాయి. సృష్టి ఉన్నంత వరకు సకల కళ్యాణ ఫలాన్ని ఇచ్చేదిగానే ఆ కార్యం సాధింపబడుతుంది. అది లోకోత్తరం సర్వక్షేమకరం అవుతుంది.

"కరుణాధీన సంకల్పః సంకల్పాధీన రక్షణః
రక్షణాధీన సద్భక్తో భక్తాధీనాత్మ వైభవః" అని ఆర్యోక్తి. భగవత్ కరుణాధీనమైనది సంకల్పము. సంకల్పాధీనమైనది రక్షణము. అట్టి భగవత్ కరుణ, రక్షణ, ఆ భగవద్వైభవము జ్ఞాన వంతులయిన భక్తుల అధీనమే!

అటువంటి భగవంతుని వైభవాన్ని తెలియజేసిన గొప్ప చరిత్ర గల మహనీయులకు ఎందరికో పుట్టినిల్లు మన భారత భూమి. భాషకూ ప్రాంతానికీ, తరతరమ భేదాలకు అతీతమైనది లోక క్షేమము. అందుకు కృషి చేసే మహనీయులైన వారికి వసుధ సమస్తము ఒక కుటుంబమే! ఉదారులైన భగవద్రామానుజాచార్యులు సంసారులైన సామాన్యుల దుఃఖం తొలగించడానికి, ఆత్మోజ్జీవనం కొరకే వారు పరి తపించారు. తాను కూడా జ్ఞాన సాధనకు వర్ణ భేదం లేకుండా ఎందరినో ఆశ్రయించారు. వారు ఆవిష్కరించిన సిద్ధాంత వైభవం వారు అనుగ్రహించి రచించిన నవరత్నాలు అను గ్రంథాల వల్ల తెలియవచ్చును. పూర్వాచార్యుల వ్యాఖ్యానాల ద్వారా పెద్దల ప్రవచనాల ద్వారా విని తరించవచ్చును. కానీ వారు ఆచరించిన విధి విధానాలను చరిత్ర ద్వారా తెలుసుకోవాలి.

జగదాచార్యులను గురించి సమకాలికులైన శిష్యులు అత్యంత భక్తితో వారి గుణాలను వెల్లడించేలా ఎన్నో స్తోత్రాలను రచించారు. వాటిలో అనేక సన్నివేశాలు వారి భక్తి పూర్వక అనుభూతులు తెలుస్తాయి. సమకాలికులు రచించినవేగాక తరవాత కాలం లోనివారి చేత కూడా గొప్పతనాన్ని వెల్లడించే వ్యాఖ్యానాలు, స్తోత్రాలు మరెన్నో రచనలు వచ్చాయి.

భగవద్ రామానుజుల కాలంలోని వారైన వైద్య పురంధరులు గరుడ వాహన పండితులను వారు యతి రాజుల చరిత్ర విశేషాలను "శ్రీ దివ్యసూరి చరితం" అను సంస్కృత గ్రంథంలో రాశారు. అందులోని ఎన్నో అంశాలను పెద్దలు విస్తారంగా వ్యాఖ్యానిస్తారు. విగ్రహ స్వరూపుడైన భగవంతుడు అర్చామూర్తితో ప్రత్యక్ష భావప్రసార సంబంధాన్ని కలిగి ఉన్నారు ఆచార్యులు. కనుకనే అనేక దివ్యదేశాల్లో ఆయా భగవన్ మూర్తుల వైభవాన్ని వెలువరించారు. దేవాలయ నిర్మాణ ఆరాధన నిర్వహణలను కూడా సంస్కరించారు. భగవద్రామానుజులు శ్రీరంగనాథుని అత్యంత భక్తితో సేవించే వారట! శ్రీరంగరాజ, అంజనగిరిరాజ, దేవరాజ, సుందరరాజ, అని (శ్రీ రంగనాథ, తిరుమల శ్రీనివాస, కంచి వరదరాజ, మేల్కోటై శెల్వపిళ్లయ్ అంటే భగవద్రామానూజాచార్యులకు ఎంతో ప్రీతి "రాజ్ఞీయోపచరణలాలసః" అని శ్రీరంగరాజ సేవా లాలసులని యతిరాజులకు ప్రసిద్ధి. స్వామి ఆరాధనలో ఏమాత్రం లోపం జరిగినా వారు తల్లడిల్లి పోయి సరి చేయించే వారట! జగదాచార్యులు శ్రీరంగనాథ కోవెల బాధ్యత నిర్వర్తించేటప్పుడు ఒకసారి రంగనాథ స్వామికి (జ్వరం) అస్వస్థతగా ఉందని వారు గుర్తించారట! శిష్యులను అడగగా వారు దధ్యన్నం (పెరుగన్నం) తో పాటు

# శ్రీరామానుజ సుధామాధురి



జంబూఫలం కలిపి నివేదన చేశారని తెలిపారు శిష్యులు. ఆ రెండు పదార్థాల మేళనం వల్ల అది విషతుల్యమై జ్వరబాధ కలిగిందని గుర్తించారట! వెంటనే అలా చేసిన వారిని మందలించి ఆ దోష నివారణకు ఒక కషాయాన్ని తయారు చేయించారు. దానిని స్వామికి నివేదన చేయించారట! ఆ ఆచారం నేటికీ కొనసాగుతున్నది. అంతేకాదు ఆరోగ్యశాల ధన్వంతరి మందిరాన్ని ఏర్పరిచారు. "ఆరోగ్యోపపద మథాకలయ్య శాలామ్ శ్రీధన్వంతరి హరి ధామ తచ్చకార" అని శ్రీ దివ్య సూరి చరిత్రలో (స.ద.సర్గ చివర) చెప్పబడింది ఇలా జగదాచార్యుల చరిత్రలో ఎన్నో అద్భుత సన్నివేశాలు వారి మాహాత్మ్యాన్ని ఎరుక పరుస్తాయి.

అటువంటి జగద్గురువులను శ్లాఘిస్తూ, ప్రార్థిస్తూ, స్తుతించే స్తోత్రాల్లో తిరువరంగత్తముదనార్ అనువారు రచించి పాడిన ఇరామానుష నూత్తన్దాది భక్తిరసాన్ని పొంగించి హృదయాన్ని ఆర్ద్రతగా సుందరం గావించే గ్రంథం. ఈ గ్రంథ ఔన్నత్యాన్ని పూర్వాచార్యులు పెద్దలు అద్భుతంగా వివరిస్తారు. భగవద్భక్తితో పులకించి భగవద్ అనుభవంతో పరిమళించినవి ఆళ్వారుల నాలాయిర దివ్య ప్రబంధ పాశురాలయితే, ఆచార్యులపై భక్తి పొంగి స్రవించిన ద్రావిడ పాటలు ఈ పాశురాలు. నూట్రందాది అని (తెలుగులో శతక గ్రంథాల వలె) 108 చందోబద్ధ ద్రావిడ పాశురాలు కలిగినది. భగవద్రామానుజుల గుణశీల వర్ణనమే కాకుండా ఆళ్వారాచార్యుల యందు భగవంతుని యందు జగదాచార్యులకు గల భక్తి సంబంధాన్ని స్తుతిస్తారు. యతిరాజులపై తనకు గల కైంకర్య భావాలు ప్రస్ఫుటించేలా రచించారు. అందుకే దేవాలయ అరయర్ సేవలో కూడా పఠించేలా ఏర్పాటు చేశారు. ప్రపన్నులైన వారికి గాయత్రీ మంత్రంతో సమానమైనదిగా ఈ ప్రబంధానికి "ప్రపన్న గాయత్రి" అని నామాంతరము ప్రసిద్ధమైంది. నాలుగు పంక్తుల ఛందోరీతిలో ఉండే ఈ గీతాల్లో ప్రతి ఒక్క దానిలోను "రామానుజ" అనే నామ కీర్తన ఉంటుంది.

ఏతాం ప్రపన్న గాయత్రీం భక్త్యా పఠతి యః పుమాన్
సర్వ పాప వినిర్ముక్తో యాతి విష్ణోః పరం పదం.

అని ఈ గ్రంథాన్ని స్తోత్రం చేస్తారు. ప్రణవంగా కొలువబడే ఈ దివ్య ప్రబంధాన్ని రచించిన రంగామృత కవీంద్రులు భగవద్రామానుజులకు ప్రశిష్యులు. అముదనారు (రంగామృత కవీంద్రులు)యతి రాజులకు ప్రియ శిష్యులైన కూరేషులకు శిష్యులు. శ్రీ రంగనాథుని దేవాలయ నిర్వహణాధికారిగా ఉండేవారు. వారు రంగనాథుని ఆరాధన నిర్వహణ సక్రమంగా నిర్వర్తించేవారు కాదు. అది చూసి రామానుజాచార్యులు చింతించేవారట! నిత్యం లౌకిక వినోదాలతో కాలం గడిపే అముదనార్లను ఏ విధంగా అయినా తీర్చిదిద్దాలని సంకల్పించుకున్నారు యతి రాజులు. ఈ పనికి కూరేషులే సమర్థులుగా భావించి వారికి ఈ పనిని అప్పగించారు. నిత్యం నాట్య వినోదాలతో విలసిల్లే అముదనార్ల ఇంటికి కూరేశులు రోజు వెళ్లి కూర్చుండేవారట! సంగీత భరతనాట్య కాలక్షేపం జరుగుతూ ఉండేది.రోజు వీరిని చూసి ఎవరు అంతగా పట్టించుకోలేదు. సకల కళా పరిజ్ఞానం గల కూరేషులు ఒకరోజు సంగీతంలో తప్పిన తాళాన్ని, నాట్యంలో తప్పిన అడుగులను గుర్తించి ఆ దోషాలను అముదనార్లకు తెలిసేలా ఎత్తి చూపించారు.

ఆయన కూరేశుల జ్ఞానానికి (మిగతా 21 వ పేజీలో)



# భూలోక వైకుంఠం భద్రాచల క్షేత్రం

ప్రత్యేకం

భూలోకవైకుఠం భద్రాచలం. భద్రాచల దివ్యక్షేత్రానికి ఎంతో ప్రాముఖ్యత ఉన్నది. బ్రహ్మపురాణంలో భద్రాచల క్షేత్రమహాత్మ్యం అత్యద్భుతంగా వర్ణించబడింది. అష్టాదశ పురాణాలను రచించినటువంటి వేదవ్యాస భగవానుడు బ్రహ్మ పురాణంలో భద్రాచల క్షేత్రం ఏవిధంగా ఆవిర్భవించిందో తెలియపరచాడు. త్రేతాయుగంలో భగవంతుడు రామచంద్రమూర్తిగా అవతరించి మానవధర్మాలను లోకానికి ఆ అవతారం ద్వారా ఆచరించి చూపాడు. ఆ అవతారకాలంలో తన తండ్రి దశరథ మహారాజుయొక్క ఆజ్ఞమేరకు సీతాలక్ష్మణ సమేతుడై రామచంద్రమూర్తి పధ్నాలుగు సంవత్సరములు వనవాసం చేసినప్పుడు దండకారణ్యంగా పిలువబడే ఈ భద్రాచలానికి విచ్చేసాడు. భద్రాచలానికి సమీపంలో ఉన్న పర్ణశాలలో సీతారామ లక్ష్మణులు నివసించారు. ఆసమయంలో సీతారామలక్ష్మణులు ముగ్గురూ వనవిహారం చేస్తూ ఆప్రాంతమంతా తిరుగుతూ గోదావరీ తీరంలోని ఒక శిలపై కాసేపు విశ్రాంతి తీసుకోగా వారికి ఆశిల గొప్ప విశ్రాంతిని కలుగచేసింది. సీతారాములు ఆశిలను దీవించారు.

“భవిష్యసి మహాత్మత్వం భక్తోపి గిరి రూపధృత్” మాకు ఈ కొద్దిసేపు విశ్రాంతిని ఇచ్చిన ఫలితంగా వచ్చేజన్మలో నీవు మా భక్తుడవై పుట్టి సర్వకాల సర్వావస్థల్లోనూ మా సేవను చేసుకునే భాగ్యం పొందగలవు. సీతారాముల దీవెన లందుకున్న ఆశిల అనంతర కాలంలో మేరువు మేరుదివి అనే దంపతులకు కుమారునిగా జన్మించింది. ఆ దంపతులు తమ కుమారునికి భద్రుడు అని పేరు పెట్టి పెంచుతూ ఉన్నారు. భద్రునికి పూర్వజన్మ స్మృతి ఉన్నది. తాను పూర్వజన్మలో ఒక రాయిగా పడిఉంటే సీతారాములు ఉత్తమమైన మానవ జన్మ కలుగ జేశారు. అనే గొప్ప కృతజ్ఞతా భావంతో రామ భక్తుడై నారద మహర్షి వద్ద రామతారక మంత్రోపదేశాన్ని, పొంది రాముడు సంచరించిన ఈ గోదావరీ నదీ తీరంలో ఉంటూ రామదర్శనం కొరకు అనేక వేల సంవత్సరాల తపస్సు చేశాడు. ఆయన తపస్సుకు మెచ్చి అప్పటి తమ అవతారాన్ని ముగించిన రామచంద్రుడు వైకుంఠంలో నుంచి శ్రీమన్నారాయణమూర్తి భూలోకానికి వచ్చి సీతాలక్ష్మణ సమేతుడై భద్రమహర్షి ముందు శంఖ చక్ర ధనుర్బాణ ధారి అయిన రామచంద్రమూర్తిగా, చతుర్భుజ రాముడుగా సాక్షాత్కరించాడు. భద్రమహర్షి తన ముందు కనపడిన శ్రీరాముణ్ణి వరం కోరుకున్నాడు. ‘అనేన మే ప్రసన్నేన రూపేణ మమ మూర్ధని, శంఖచక్రధనుర్బాణ సీతాలక్ష్మణ సంయుతః, నివస త్వం రఘుశ్రేష్ఠః నాథః కాంక్షే వరం ప్రభో’ ఓ స్వామి నాకు నీవు ఎలా దర్శనం ఇచ్చావో అదే రూపంలో సీతాలక్ష్మణ సహితుడవై శంఖచక్రధనుర్బాణ ధారివై చతుర్భుజ రాముడుగా నాశిరస్సుమీద వేంచేసి ఉండవలసినదని ప్రార్థించగా ఆ భద్రమహర్షి కోరికను తీరుస్తూ ఆయన తలపై తన పాదములను ఉంచాడు. రామపాద స్పర్శ తగలగానే భద్రమహర్షి ఒక కొండగా మారిపోగా కొండపై రామచంద్రమూర్తి సీతాలక్ష్మణ సమేతుడై స్వయంభువుగా ఆవిర్భవించాడు. అని వేద వ్యాసమహర్షి బ్రహ్మపురాణంలో తెలిపాడు. అటువంటి అత్యంత పురాణ ప్రఖ్యాతమైన స్వయంభూ రామక్షేత్రం భద్రాచలం దివ్యక్షేత్రం. వైకుంఠం నుంచి సాక్షాత్తుగా శ్రీమన్నారాయణుడే ఆ భద్ర మహర్షి ముందు సాక్షాత్కరించి అర్చామూర్తిగా ఈ భద్ర పర్వతంపై ఆయన కొలువు తీరి ఉన్నాడు. భద్రమహర్షి ఆయనను ధరించి ఉన్న కారణంగా ఈ క్షేత్రానికి భద్రాచలమని పేరు ఏర్పడింది “వైకుంఠవత్ సదా తస్మిన్ వైకుంఠపుర వాసిభిః” అంటూ బ్రహ్మపురాణంలోని ఈ క్షేత్ర మహత్యంలో వైకుంఠంలో వైకుంఠపురవాసులతో ఎలాగైతే వేంచేసి ఉంటాడో అలాగే “వైకుంఠవత్ సదా” వైకుంఠంలో వలె ఎల్లప్పుడు భద్రపర్వతంపైన రామచంద్రమూర్తి కొలువుతీరి ఉంటాడు అని చెప్పబడింది. భద్రాచలంలో



**శ్రీమాన్ శ్రీ కె.ఇ.స్థలశాయి,** స్థానాచార్యులు
శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం భద్రాచలం



# భూలోక వైకుంఠం భద్రాచల క్షేత్రం

వేంచేసి ఉంటాడని చెప్పబడింది.

రామదాసుగారు ఈ క్షేత్రపురాణాన్ని ఆధారంగా చేసుకుని భద్రాచలాన్ని భూలోక వైకుంఠము అని అభివర్ణించారు.

“శ్రీరమ సీతగాగ నిజసేవక బృందము వీరవైష్ణవా
చార జనంబుగాగ విరజానది గౌతమిగా వికుంఠ ము
న్నారయభద్ర శైలశిఖరాగ్రముగాగ వసించు చేతనో
ద్ధారకుడైన విష్ణుడవు దాశరథీ కరుణాపయోనిధీ” అంటూ దాశరథీ శతకంలో వైకుంఠంలో ఉండే సన్నివేశం భద్రాచలంలో ఉన్నదీ అని భద్రాచలం భూలోక వైకుంఠము అని రామదాసుగారు చెపుతున్నారు. లక్ష్మీదేవి సీతమ్మగా, వైకుంఠంలో లక్ష్మీ నారాయణులకు నిరంతర సేవచేసే వైకుంఠ పార్శ్వకులు అయిన అనంత గరుడ విశ్వక్సేనాదు లంతా ఈ భద్రాచలంలో కైంకర్యం చేసే అర్చక, పరిచారక, అధ్యాపకాది రూపంలో ఉండి స్వామికి సేవలు చేస్తున్నారట. భద్రశైల శిఖరాగ్రము పైన విమాన స్థానం ఏదైతే ఉందో అది వైకుంఠము అన్నారు. భక్త రామదాసుగారు ఈ పద్యం ద్వారా భద్రాచలాన్ని గురించి శ్రీరాముడు చేతనోద్ధారకుడైన విష్ణుడు అని భూలోక వైకుంఠనాథుడు భద్రాచలంలో గల రామచంద్రుడు అర్చామూర్తిగా సాక్షాత్తు వైకుంఠం నుండి నేరుగా దిగినటువంటి వాడు అని చెపుతున్నారు. ఆయన ఉన్న స్థానం వైకుంఠమనే కాకుండా అయోధ్యయే వైకుంఠము అనే మాట. వేదముల ద్వారా తెలుస్తున్నది.

“దేవానాం పూరయోధ్యా తస్యాగుం హిరణ్మయః కోశః” అని అరుణ పాఠంలో కృష్ణ యజుర్వేదంలో అన్నారు. దేవతలు అనగా నిత్య సూరులు. వారు ఉండే స్థానానికి అయోధ్యా అని పేరు. కనుక వైకుంఠానికి అయోధ్య అని మరొక పేరున్నది. ఆపేరునే ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యకు పెట్టుకున్నారని మనువు తన రాజధానిగా చేసుకొని అయోధ్యా ప్రాంతాన్ని పరిపాలించాడు అని, రామచందమూర్తి తన అవతార కాలంలో పదకొండువేల సంవత్సరాలు పరిపాలించాడు అని మనకు రామాయణం ద్వారా వాల్మీకి మహర్షి తెలియ పరిచాడు. రాముడు ఉన్న స్థానం అయోధ్య. వైకుంఠానికి అయోధ్య అని పేరున్నది. ఈ రెండింటికీ గుర్తు చేస్తూ వేదాంత దేశికుల వారంటారు “దివ్యభౌమ అయోధ్యాధి దైవతా” దివ్యమనగా పరమపదం, భౌమమనగా భూలోకం లోని అయోధ్య, రెండిటికి అయోధ్య అనిపేరు. అధిదైవమే శ్రీరామచంద్రుడు అని వేదాంత దేశికులు రఘువీర గద్యలో రామచంద్రుని కీర్తిస్తారు. అలాగే భద్రాచల దివ్యక్షేత్రం కూడా వైకుంఠమే! స్వయంగా శ్రీమన్నాయణుడే భూలోకానికి దిగినటువంటి ప్రాంతం. ఈ ప్రాంతంలో శ్రీరామచంద్రమూర్తి స్వయంభువుగా ఆవిర్భవించాడు అనేది తెలుగు రాష్ట్రాలకు ఎంతో గర్వ కారణమైన ప్రాంతం. అయోధ్యకు ఎంత వైశిష్ట్యం ఉందో భద్రాచలానికి అంత వైశిష్ట్యం ఉన్నది. రాముడు రామావతార కాలంలో వనవాస సమయంలో సంచరించిన ప్రాంతం. రామావతారం ముగిసిన తరువాత కూడా భద్రమహర్షి తపఃఫలంగా వైకుంఠం నుంచి శంఖ చక్ర ధారియై చతుర్భుజుడుగా ఆవిర్భవించిన ప్రాంతం భద్రాచలం. సీతారాములకు లక్ష్మీ నారాయణులుగా ఆరాధన జరపడం ఆచారం.

“రథస్థం రాఘవం దృష్ట్వా పునర్జన్మ నవిద్యతే” రథమందు వేంచేసిన రాఘవుడైన భద్రాచల రామున్ని సేవించిన వారికి పునర్జన్మలేదు. అందుకే భూలోకవైకుంఠం భద్రాచల క్షేత్రం.

రామదాసుగారి దాశరథి శతకం ద్వారా క్షేత్ర మహత్యం ద్వారా ఇక్కడ ఉండే రామచంద్రుని వైకుంఠరాముడని, ఓంకార రాముడని, భద్రాద్రి రాముడని, సీతారామచంద్ర మూర్తి అని అనేక పేర్లతో ఈ స్వామిని కీర్తిస్తారు. ద్వాపర యుగం చివర నుండే స్వయం వ్యక్త క్షేత్రమైన ఈ క్షేత్రాన్ని భక్తరామదాసు 17వ శతాబ్దంలో జీర్ణోద్ధరణ చేసి గొప్ప ఆలయాన్ని నిర్మించారు. తద్వారా రాముని గొప్పతనాన్ని చాటాడు. రామచంద్రమూర్తి ఒక్కడే దైవమని లోకానికి చాటుతాను అని దాశరథీ శతకంలో అంటాడు. అటువంటి భూలోక వైకుంఠమైన ఈ క్షేత్రంలో శ్రీరామనవమి పండుగను శ్రీరాముడు అవతరించిన రోజును ఎంతో విలక్షణంగా జరుపుకోవటం అనూచానంగా వస్తున్న గొప్ప ఆచారం.

# భూలోకవైకుంఠం భద్రాచలక్షేత్రం

శ్రీరామనవమి అనగానే అయోధ్యకంటే ముందే గుర్తుకు వచ్చే క్షేత్రం భద్రాచల క్షేత్రం. ఇక్కడ ఉగాది నుండి ప్రారంభించి 15 రోజులు పక్షోత్సవంగా జరుపబడతాయి. వసంత పక్ష ప్రయుక్త శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలుగా కీర్తింప బడుతున్నాయి. ఉగాది నుండి పూర్ణిమ వరకు నిర్వహించబడే ఈ బ్రహ్మోత్సవాల్లో శ్రీరామచంద్రమూర్తి ఒక్కోక్క రోజు ఒక్కొక్క వాహనంలో పన్నెండు వాహనాలపైన ఊరేగటం గొప్ప విశేషమైన విషయం. ఆ పన్నెండు వాహనాలు ఏమిటంటే ఎందుకు అంటే? ద్వాదశాదిత్య రూపంగా మరియు ద్వాదశాక్షర రూపంగా ఉండే వాహనాలపైన ఒక్కోరోజు ఒక్కోరకంగా భక్తులకు దర్శనం ఇస్తాడు. ఉగాది రోజు కల్పవృక్ష వాహనం, మర్నాడు సార్వభౌమ వాహనం, ఎదుర్కోలు ఉత్సవంనాడు గరుడవాహనం ముందురోజు హనుమద్ వాహనంపై ఇలా దర్శనం ఇస్తాడు. శ్రీరామనవమి నాడు కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించబడుతుంది. మర్నాడు పట్టాభిషేక మహూత్సవం చేసుకొని రాముడు పుర వీధుల్లో రథంపై ఊరేగుతాడు. కళ్యాణోత్సవం, పట్టాభిషేకం కన్నులపండుగగా వైభవంగా నిర్వహించబడుతాయి. అంతేగాక రామాయణ, వేద, ఇతిహాస, దివ్య ప్రబంధ పారాయణాలు వైభవోపేతంగా నిర్వహింపబడుతాయి. పూర్ణిమనాడు శ్రీపుష్పయాగంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి. ఆరోజు శ్రీరాముడు దివ్య ఊర్ధ్వపుద్రంతో విశేషంగా దర్శనం ఇస్తారు. సంవత్సరమంతా కస్తూరి తిలకంతో దర్శనఇచ్చే రాముడు పూర్ణిమనాడు పుష్పయాగంలో ఆదిశేష వాహనంపై దివ్య ఊర్ధ్వపుండ్రంతో వైకుంఠనారాయణుడిగా, పరమపద నాథునిగా భక్తులకు దర్శనం ఇస్తాడు. "రథస్థం రాఘవం దృష్ట్వా పునర్జన్మ నవిద్యతే" అని క్షేత్ర పురాణంలో చెబుతారు. రథమందు వేంచేసిన రాఘవుడైన భద్రాచల రామున్ని సేవించిన వారికి పునర్జన్మలేదు. అందుకే భూలోకవైకుంఠం భద్రాచల క్షేత్రం.

ద్వాదశ ప్రదక్షిణలు ద్వాదశారాధనలతో పూర్ణిమ నాడు పుష్పయాగంలో శ్రీరాముడు గొప్ప శేష వాహనం పైన దివ్యోర్ధ్వ పుండ్రధారియై ఊరేగుతూ పుష్పయాగాన్ని స్వీకరించే ఉత్సవం కన్నుల పండుగగా ఉంటుంది. ఆ వైభవాన్ని అందరం దర్శించి తరిద్దాం!. ★


# శ్రీరామానుజ సుధామాధురి

(12 వ పేజీ తరువాయి) అబ్బురపడి వారిని వెంటనే గౌరవించారు. నాటి నుండి వారిని గురువుగా ఎంచి ఎన్నో విషయాలు నేర్చుకునేవారు. ఆధ్యాత్మిక సాంప్రదాయ విషయాలెన్నో వారు బోధించారు.అముదనారులో గొప్ప మార్పు వచ్చింది.. శ్రీరామానుజాచార్యులు రంగనాథుని ఆరాధన నిర్వహణను దేవాలయ తాళం చెవులను తన అధీనంలోకి తీసుకోవాలని సంకల్పించారు. కూరనాథులను అది సాధించడానికి నియమించారు. ఒకరోజు అముదనార్ల ఇంట్లో పైత్రుకం (పితృకార్యం) వచ్చింది.తన గురువు అయిన కూరేషులను భోక్తగా ఇంటికి ఆహ్వానించారు. భోజనం ముగిసిన తర్వాత భోక్త "తృప్తోస్మి" అనాలని శాస్త్ర నియమం. కానీ కూరేషులు మౌనం వహించారు. అముదనారు కలవరపడి తన ఆచార్యులకు ఏదైనా ఇయ్యడానికి సిద్ధపడ్డారు. అప్పుడు కూరేశులు దేవాలయ తాళం చెవులు, నిర్వహణ అధికారాన్ని అడిగారట! అముదనార్లు భక్తితో వాటిని సమర్పించారు. కూరేశులు "తృప్తోస్మి" అని సంతోషించి యతిరాజులకు వాటిని సమర్పించారని ఒక ప్రాచుర్యమైన కథాంశం. తరువాత వారు ఆచార్య కైంకర్య నిష్ఠతో జీవించసాగారు. యతి రాజులయందు భక్తి ప్రపత్తులు పెరిగి, గానామృతంతో తమ ఆచార్యులను సేవించాలని భావించి ద్రావిడంలో స్తోత్రాన్ని రచించి గురువగు కూరేషుల అనుమతితో పాడి వినిపించారట! కానీ తనపై స్తుతిని ఇష్టపడని ఆచార్యుల హృదయం తెలుసుకున్నారు. మళ్లీ రచించి వారి అభిముఖంగానే గద్గద స్వరంతో భక్తితో మళ్లీ పాడి వినిపించారట! సంప్రదాయ రహస్య సారంగా, మధుర భావాక్షరకూర్పుగా, ఆచార్య సేవానిష్ఠను ప్రతిఫలించే "ఇరామానుషనూత్తందాది" స్తోత్రాన్ని విని పరవశించారు జగదాచార్యులు., అనుమతించి ప్రణవ సమానంగా ద్రావిడ దివ్య ప్రబంధాలతోపాటుగా పఠించే యోగ్యతను స్వయంగా కల్పించారని చరిత్ర.

అద్భుత భావాలతో ప్రపన్న సుందరమైన స్తుతితో ప్రసిద్ధులైన పరమ గురువులు శ్రీభగవద్రామానుజాచార్యులను శ్రీరంగామృత కవీంద్రులు కీర్తిస్తారు. ఇందులో ప్రతి పాశు రము గురు వందన రూపమగు భక్తి పరిమళాల నద్దిన బంగారు పుష్పమే!. ★

# శ్రీపతి స్తుతి - సుభాషితం

మంచి మాట



శ్రీమాన్ శ్రీ అమరవాది వేంకటనరసింహాచార్యులు

## అర్చిరాది సంగ్రహం

శ్రీమతే రామానుజాయ నమః

ఉపోద్ఘాతము: బంధువులారా! భగవత్ భక్తులారా! మనము గతంలో చేసుకున్న కర్మకు అనుగుణంగా శరీరాలు భగవంతుడు ఇస్తాడు.

"జన్మాంతర సహస్రేషు మానుషం జన్మలభ్యతే" అనేక వేల జన్మలలో మానవ జన్మ లభిస్తుంది. ఈ శరీరంలో నున్న ఆత్మ 'జ్ఞానముతో ప్రకాశించే అవకాశాన్ని' కలిగియుంటుంది. మానవజన్మ తర్వాత ఏ జన్మ వస్తుందో తెలియదు. జన్మ పరంపరలన్ని దుఃఖ దాయకములే! మానవ జన్మలో మాత్రమే మంచి చెడు తెలుసుకొనగలము. ఏదైతే మనకు 'సుఖం' అనిపిస్తుందో అది క్షణికము. కాలాంతరంలో దుఃఖ కారణం అవుతున్నది. కాబట్టి దుఃఖలేశం కూడా లేకుండా ఎల్లప్పుడు సుఖంగా వుండాలంటే ఈ జన్మలోనే అది సాధ్యము.

ఎక్కడ సుఖం? ఎవరిస్తారు? ఎప్పుడిస్తారు? దానికై మనం ఏం చెయ్యాలి? ఎప్పుడు చెయ్యాలి? ఎట్లా? ఇన్ని సందేహాలు కలుగుతవి. సమాధానాలు విందాం!

సృష్టి, స్థితి, లయ మోక్షప్రదుడైన శ్రీమన్నారాయణుని యొక్క దివ్యధామము శ్రీవైకుంఠము. మనం కోరుకునే సుఖం అక్కడ శ్రీమన్నారాయణుడు ఇచ్చును. ఈ పంచ భూతముల కలయిక వలన గలిగిన శరీరం విడిచిన తర్వాత. అందుకై మనము మంచి ఆచార్యులను ఆశ్రయించి పంచ సంస్కారమును లభించి ఎల్లప్పుడు ద్వయమంత్రమును చదువుకొనుచుండాలి. ఎప్పుడు మనకు బుద్ధి కలుగునో అప్పుడే! "భగవంతుడు తప్ప మరెవ్వరు రక్షకులు గారు" తనకు తాను గూడా కాదు అని దృఢ విశ్వాసంతో శరణాగతి చెయ్యాలి.

**ఎప్పుడైతే ఆచార్యుని ద్వారా పరమాత్మకు శరణాగతి చేసి తనను స్వామికి అర్పణ చేసుకొని 'తనరక్షణ అంతా ఆయన బాధ్యత అనుకుంటాడో అప్పుడే స్వామి మన కర్మలను తొలగించి తన వద్దకు చేర్చుకునే బాధ్యత వహించును.**

మరి మనం ఈ శరీరం విడవడం వైకుంఠం చేరడం, అక్కడికి వెళ్ళేమార్గం, అక్కడికి చెర్చేవారు ఇవన్ని తెలుసుకోవాలి. దానికే ఆర్చిరాదిమార్గం అనిపేరు. దానిని శ్రీమాన్ వరదాచార్యులు గారు స్పష్టంగా, సంగ్రహంగా రెండు శ్లోకములలో ఇమిడ్చి అందించారు. అనుసంధించుకుందాము.

శ్లో॥ సత్సంగాత్ భవ నిస్స్పృహో (నిఃస్పృహో) గురుముఖాత్
శ్రీశం ప్రపద్యాత్మవాన్,
ప్రారబ్ధం పరిభుజ్య కర్మశకలం ప్రక్షీణ కర్మాంతరః।
న్యాసాదేవ నిరంకుశేశ్వర దయా నిర్లూనమాయాన్వయః
హార్దానుగ్రహ లబ్ధ మధ్య ధమని ద్వారాత్ బహిర్నిర్గతః॥

ప్రతి పదార్థము: సత్సంగాత్= సత్పురుషుల సహవాసం వలన, భవ నిస్స్పృహః = సంసారంపై విరక్తి గలవాడై, గురు ముఖాత్ = ఆచార్యుల ద్వారా, శ్రీశం = శ్రియఃపతిని, ప్రపద్య = శరణాగతి చేసి, ఆత్మవాన్ = ఉన్నవారిలో ఒకడుగా పరిగణింపబడును (లబ్ధ సత్తాకుడు), ప్రక్షీణ కర్మాంతరః = ఇతరములైన సంచిత, ఆగామి కర్మలు క్షీణించినవాడై, ప్రారబ్ధం = ప్రారబ్ధం అనబడే, కర్మశకలం = అల్పమైన కర్మను, పరిభుజ్య = అనుభవించి. న్యాసాత్+ఏవ = తాను చేసిన శరణాగతి వలననే, నిరంకుశ+ఈశ్వర = సర్వ స్వతంత్రుడై అందరిని శాసించే వాడైన భగవానుని, దయా = మన భారమును తనపై వేసుకొన్న దయతో, నిర్లూన = సంపూర్ణంగా తొలగింప బడిన, మాయాన్వయః = ప్రకృతి సంబంధం గలవాడై, హార్దా = హృదయ మందున్న శ్రీహరి యొక్క, అనుగ్రహ = అనుగ్రహం చేత, లబ్ధ = లభించిన, మధ్య ధమని ద్వారాత్ = ప్రధానమైన మధ్యనున్న 'సుషుమ్న' అనబడే ధమని నాడి తన గొప్ప వెలుగుతో చూపబడగా దాని ద్వారా బ్రహ్మకపాల ద్వారమును భేదించుకొని, బహిః = వెలుపలికి, నిర్గతః = వెడలిన వాడు అవుతాడు.

(మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో)

# శ్వేతాశ్వతరోపనిషత్తులో ఆచార్యవైభవమ్

"వేదైశ్చ సర్వై రహమేవ వేద్యః" (వేదాలు అన్నిటిచేత తెలియబడేవాడను నేనే) అంటూ భగవద్గీతలో వేదతాత్పర్య స్వరూపంగా తనను తాను నిర్దేశించుకున్నాడు శ్రీకృష్ణ పరమాత్మ. పూర్వోత్తరభాగాలుగా, రెండు విధాలుగా విభాగింపబడిన వేదంలోని పూర్వభాగం భగవంతుని ఆరాధనా స్వరూపాన్ని, వేదాంతంగా చెప్పబడే ఉత్తరభాగం భగవంతుని ఆరాధ్య స్వరూపాన్ని తెలియజేస్తున్నది.

వేదం, ఈ విధంగా పూర్తిగా భగవంతుని వైభవాన్ని తెలియజేసేది అయినప్పటికీ, కొన్ని కొన్ని సందర్భాలలో ఆచార్య వైభవాన్నికూడా అది వ్యక్తం చేసింది. శ్రీవైష్ణవ సంప్రదాయంలో, భగవద్భక్తి మూడువిధాలైన పర్వాలను కలిగినదని, అందులో, భగవద్భక్తి ప్రథమ పర్వం అని, భాగవతభక్తి మధ్యమ పర్వం అని, ఆచార్య భక్తి చరమ పర్వం అని చెప్పబడుతుంది. అందువల్ల ఆచార్య వైభవాన్ని తెలియజేసే వేదవాక్యాలు కూడా భగవంతుని వైభవంలోకే పర్యవసిస్తాయి అని పెద్దల నిష్కర్ష.

ఆచార్యుని భగవత్స్వరూపునిగా భావించి ఆరాధించమని "దేవమివాచార్య ముపాసీత", "ఆచార్యః స హరిః సాక్షాత్ చరరూపీ న సంశయః" మొదలైన ఎన్నో సూక్తులు తెలుపుతున్నాయి. ఆ విధంగా ఆచార్య వైభవాన్ని తెలియజేసే ఒక సూక్తి శ్వేతాశ్వతరోపనిషత్ చివరిలో మనకు గోచరిస్తున్నది. ఆ సూక్తి ఈ విధంగా ఉన్నది.


"యస్య దేవే పరా భక్తిః యథాదేవే తథా గురౌ,
తస్యైతే కథితాః హ్యర్థాః ప్రకాశంతే మహాత్మనః"

ఎవనికి భగవంతుని పట్ల గొప్ప భక్తి ఉన్నదో, ఆ విధంగానే, భగవంతునిలో ఎంత భక్తి ఉన్నదో, అంతటి భక్తి ఆచార్యుని విషయంలో ఎవనికి ఉన్నదో, అతడు మహాత్ముడు. ఆ మహనీయునకు ఆచార్యుని వల్ల తాను అధికరించిన అర్థాలు మనసులో ప్రకాశిస్తాయి ? అనేది ఈ సూక్తి లోని తాత్పర్యం.

ఈ సూక్తి ఆచార్యభక్తికి కల ప్రాధాన్యాన్ని, వైభవాన్ని తెలుపుతున్నది. ఎంత గొప్ప విద్యను ఆచార్యుని సన్నిధిలో నేర్చినప్పటికీ, ఆచార్యుని విషయంలో భక్తివిశ్వాసాలు లేకపోతే, నేర్చిన విద్య ఫలితాన్ని ఇవ్వదు.

"మంత్రే తద్దేవతాయాం చ తథా మంత్రప్రదే గురౌ
త్రిషు భక్తిః సదా కార్యా సా హి ప్రథమ సాధనమ్"

( మంత్రంలో, ఆ మంత్రం చేత ప్రతిపాదింపబడే దైవం విషయంలో, ఆ మంత్రాన్ని ఉపదేశించిన ఆచార్యుని విషయంలో, ఎల్లప్పుడూ భక్తిని



**శ్రీమాన్ శ్రీ డాక్టర్ ఈ.ఏ. శింగరాచార్యస్వామి**

కలిగి ఉండాలి. ఆ భక్తియే కార్యసిద్ధికి మొట్టమొదటి సాధనం) అని ఈ విషయాన్ని శాస్త్రాలు చెబుతున్నాయి. పరశురాముని దగ్గర ఎంతో గొప్ప విద్యను నేర్చిన కర్ణుడు, ఆ పరశురాముని విషయంలో అపచారపడినందున, చివరికి ఆ విద్య అతనికి పనికిరాకుండా పోయిన సంగతిని మహాభారతం తెలుపుతున్నది కదా.

పైన ప్రస్తావించిన ఉపనిషత్తులో ఒక విశేషమైన విషయం ఉన్నది. ఆచార్యుని దగ్గర నేర్చిన విద్య ఉపయోగపడాలంటే ఆచార్య భక్తి ఉండాలి? అనేది ఒక విషయం కాగా, ఆ విధంగా ఆచార్య భక్తి ఉంటే, నేర్చిన విద్య సఫలం అవుతుంది అనేది ఇంకొక విషయం. దీనికి మించి ఇంకొక అపూర్వమైన విషయం కూడా ఈ సూక్తిలో సూచింపబడింది. అర్థం ఈ సూక్తి సన్నివేశాన్ని బట్టి భాసిస్తున్నదని పెద్దలంటారు.

పై సూక్తిలోని "తస్యైతే కథితాః హ్యర్థాః" అనే ప్రయోగం ఇటువంటి అర్థాన్ని చెప్పడానికి అవకాశాన్ని ఇస్తున్నది. ఏ విధంగా అంటే, పై ప్రయోగాన్ని, "తస్యైతే కథితాః హ్యర్థాః" అని అన్వయించి అర్థం చెప్పినట్లే, "తస్యైతే అకథితాః హ్యర్థాః" అని విడదీసి అర్థం చెప్పే అవకాశం ఉన్నది. ఇది సంస్కృతభాషా మర్యాదను అనుసరించి ఏర్పడింది.

ఈ విధంగా, ఇంకొక రీతిలో పదాలను విడదీసి అర్థం చెప్పడం వల్ల ఏ విశేషమైన అర్థం స్ఫురిస్తున్నదని అంటే, ఆచార్యుని విషయంలో భక్తి ఉన్నట్లయితే, ఆ ఆచార్యుని దగ్గర నేర్చిన అర్థాలన్నీ మనసులో (మిగతా 21 వ పేజీలో)

# శుభాశుభ నిర్ణయాలు-మీమాంస

## భూపరీక్షా క్రమము

శ్వేత వర్ణము, సుగంధము, మధురసము, గంభీరము, కుశయుక్తము ఉత్తర ప్లవమునైన భూమి శ్రేష్ఠమైనది. ఇందులో గృహమును నిర్మించిన యెల్లప్పుడు సుఖము కలుగును. రక్తమవర్ణము, రక్తగంధము, కషాయరసము, తుంగము శరయుక్తము. పూర్వ ప్లవమునైన భూమి మధ్యమము ఈ భూమి రాజ్యప్రదముగా యుండును. పీతవర్ణము, మధుగంధము, ఆమ్లరసము, సమానము కాశయుక్తము అయిన భూమి అధమము. ధనధాన్యాది లాభమును కలుగ చేయును కాని సుఖాదులను మన శ్శాంతిని కలుగచేయదు. కృష్ణవర్ణము మధ్యగంధము కటుకరసము వికటము తృణ యుక్తమునైన భూమియు, దక్షిణ పశ్చిమముల యందు పల్లముగా యున్న భూమి నింద్యము.

యజమాని వర్ణమునకు సరియైన వర్ణము గంధము, రసము గల భూమి ధనధాన్యముల నిచ్చును. స్వవర్ణ వ్యతిరిక్తమైన వర్ణ రసగంధాదులు గల భూమి నష్టమును కలుగచేయును.

శ్లో॥ అగ్రజాతే శ్శుభాభూమి రల్పజాతే శ్శుభప్రదా।
అల్పజాతే శ్శుభాభూమి ర్నగ్రాహ్యం త్వగ్రజస్యహి॥

అగ్రజాతికి శుభప్రదమైన భూమి అల్పజాతికి శుభదము అగును. అల్ప జాతికి శుభప్రదమయిన భూమి అగ్రజాతికి కష్టనష్టముల నిచ్చును. బ్రాహ్మణులకు బ్రహ్మీజాతి భూమియు క్షత్రియులకు క్షత్రియ బ్రహ్మీజాతి భూమియు, వైశ్యులకు వైశ్య క్షత్రియ బ్రహ్మీజాతి భూములను శూద్రులకు శూద్ర వైశ్య క్షత్రియ బ్రహ్మీజాతి భూములు శ్రేయస్కరములు.

శ్లో॥ వస్త్వా కృతి రనింద్యా సావాక్రుత్యక్ దిక్సమున్నతా।
హయేభ రేణువీణాబ్ది దుందుభిధ్వనిసంయుతా॥

దక్షిణ పశ్చిమ దిశల యందు ఎత్తుగానున్న భూమి యోగ్యము. గుఱ్ఱము ఏనుగు వెదురు వీణ సముద్రము భేరి వీని ధ్వనిగల భూమి శ్రేష్ఠము. కీచురాయి ప్రతిధ్వని భూతధ్వని భయంకర ధ్వని యిలాంటి భూములు నింద్యమైనవి.



భూమి యొక్క లక్షణములను పరీక్షించి గంధము వర్ణము రసము రూపము దిక్కు స్పర్శ మొదలగు లక్షణములతో యోగ్యము గానున్న భూమిని స్వీకరింపవలయును. "కలౌ పంచ సహస్రాణి జాయతే వర్ణసంకర". అను వచనము

**శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి**

ద్వారా ఈనాటి కాలపరిస్థితుల ననుసరించి జాతి మత కుల. భేదము మొదలగు వాటికి ప్రాధాన్యము నివ్వక ఉత్తమమైన భూమియందు గృహ నిర్మాణము చేసిన అత్యంత సుఖము. శుభము ధన ధాన్య ఐశ్వర్యములను పొందగలరు.


లక్షణములు:–

వాస్తు, లక్షణము లెన్ని? అవి ఏవి?

వాస్తు లక్షణములు పదహారు అవి క్రమముగా 1.ఆయతము, 2. చతురస్రము, 3. వృత్తము, 4.భద్రాసనము 5. చక్రము, 6. విషమబాహువు, 7.త్రికోణము, 8.శకటము, 9.దండము, 10.ప్రణవము, 11. మురజము, 12. బృహన్ముఖము. 13. వ్యజనము. 14. కూర్మపృష్టము, 15. ధనుస్సు, 16. శూర్పము. భూమి యొక్క ఆకారము ననుసరించి నిర్ణయించడం శ్రేయోదాయకము.

1. ఆయతాకారము:

"ఆయమ్యతే విస్తీర్యత ఇత్యాయతం యమ ఉపరమే।



గృహము నిర్మించదలచిన భూమి వెడల్పు కంటె పోడవు ఎక్కువగా వున్న భూమిని ఆయతాకార మందురు. ఈ భూమి యందు గృహ నిర్మాణము కావించిన 'ఆయతేః సిద్ధయ స్సర్వాః' సర్వకార్యములు సిద్ధించును. దీనిని దీర్ఘచతురస్రాకార మందురు.




# శుభాశుభ నిర్ణయాలు-మీమాంస

2. చతురస్రాకారము



చతురస్రము నాల్గు విధములు. 1, సమచతుర్భుజము, 2.సమాయత చతుర్భుజము 3.విషమ చతుర్భుజము, 4.విషమాయత చతుర్భుజము. అని నాల్గు విధములు చతుర్భుజము నందలి నాల్గుభుజములును నాల్గుకోణములు సమానముగ నున్నచో చతుర్భుజము, చతురస్రమగును. పొడవు వెడల్పులు సమానముగ నున్న భూమి చతురస్రాకారము కలిదియగును. ఈ స్థలమునందు గృహ నిర్మాణము గావించిన "చతురస్రే ధనాగమః" ధనలాభము కల్గును.


3. వృత్తాకారము.



"ఏకధరాతలేకుటిం రేఖయా
నిబద్ధ సీమం వృత్త క్షేత్రంభవతి॥"


గృహ నిర్మాణము చేయు భూమి వర్తులా కారముగా యున్న "వృత్తే పుష్టి వివర్ధనం" పోషణము వృద్ధిని యిచ్చును. "వృత్తేతు బుద్ధి వృద్ధిస్యాత్" జ్ఞాన వృద్ధిని కలిగించును.

4. భద్రాసనాకారము




గృహా నిర్మాణము చేయు స్థలము (భూమి) భద్రాసనా కారముగ యున్న "భద్రాసనే కృతార్థకం" కృతార్థత్వము "భద్రం భద్రా సనే భవేత్" శుభ ములను కలిగించును.

5. చక్రాకారము



గృహా నిర్మాణము చేయు స్థలము చక్రాకారముగ వున్న ' 'చక్రే దారిద్ర్య మేవోక్తం" దారిద్ర్యమును కలుగ చేయును.


6. విషమ బాహ్వాకారము




గృహము నిర్మించు స్థలము విషమ బాహ్వ కారముగవున్న "శోకో విషమ బాహుకే" దుఃఖము శోకమును కలిగించును.

7. త్రికోణాకారము

త్రికోణం త్రివిధం యస్మిన్ క్షేత్రే యతః కోణాస్త్ర త్రికోణ ముచ్యతే తదపి త్రిభుజ జాత్య త్రిభుజ విషమ త్రిభుజ భేదా త్రివిధం" గృహము నిర్మించు స్థలము త్రివిధములగు త్రికోణములలో ఏవిధమయిన త్రికోణాకారముగ నున్నను "నృపాద్భీతిస్త్రికోణే స్యాత్" రాజ భయమును కలిగించును.



8. శకటాకారము



గృహము నిర్మించు స్థలము శకటాకారము (బండి) గ వున్న "శకటేచ ధనక్షయః" ధన నాశనమును కలుగ చేయును.

9. దండాకారము

గృహము నిర్మాణము చేయు స్థలము దండా కారముగవున్న "నశ్యన్తి పశవో దండే" పశునాశనము కలుగ జేయును.

(మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో)

# భాగవతంలో భగవంతుని అవతార గాథలు

(క్రిందటి సంచిక తరువాయి) "ఇక భూమికి గల సాధారణ ధర్మాలేవి అంటే, ప్రతిమల రూపాలను, వాటి ఆకారాలను నిలుపుకొనటం, నీరు మొద లైనవాటితో అవసరం లేకుండా స్వతంత్రంగా నిలబడటం, జలం, తదితరాలకు తాను ఆధారం కావడం, ఆకాశం, వాయువు, తేజస్సు, నీరు వీటిని విభాగాలు చేయటం, అన్ని ప్రాణులకూ స్త్రీ పురుష భేదాలతో దేహంగా ఉండడం. వీటిని పృథ్వీవృత్తులు అంటారు.

"అమ్మా! ఈ పంచభూతాలకూ అసాధారణధర్మాలూ ఉన్నాయి. అవీ విను. ఆకాశపు అసాధారణగుణం శబ్దం. దీన్ని చెవి గ్రహిస్తుంది. వాయువు అసాధారణగుణం స్పర్శ. దీన్ని చర్మం గ్రహిస్తుంది. తేజస్సుకు అసాధారణగుణం రూపం. దీన్ని నేత్రం గ్రహిస్తుంది. నీటికి అసాధారణగుణం రసం. దీన్ని నాలుక గ్రహిస్తుంది. పృథ్వికి భూమి అసాధారణగుణం గంధం. దీన్ని నాసిక గ్రహిస్తుంది. ఆకాశం తదితరాలతో సంబంధం ఉన్నందువల్ల భూమికి శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు అసాధారణ గుణాలయ్యాయి.

"మహత్తు, అహంకారం, పంచతన్మాత్రలు ఈ ఏడూ కలసి కూడా పురుషుణ్ని కల్పించలేకపోయాయి. అప్పుడు గుణాతీతుడు, కాలస్వరూపుడు, జగత్కారణుడు, నిరంజనుడు ఐన సర్వేశ్వరుడు అందులో ప్రవేశించాడు. అప్పుడు ఒకదానితో ఒకటి కలసిన మహదాదుల వల్ల చైతన్యం లేని ఒక అండం, గుడ్డు పుట్టింది. అందులో నుండి అనంతశక్తితో 'విరాట్పురుషుడు' పుట్టాడు. ఆ అండాన్ని పొదువుకొని భూమి, నీరు, నిప్పు, ఆకాశం, అహంకారం, మహత్తు అనే ఆవరణాలు ఒక దానికన్నా మరొకటి పదింతల ప్రమాణంతో ఉన్నాయి. లోకాలన్నిటికీ మేలుకట్ల వలె ఉన్న ఆ పొరలలో జగన్నాథుడైన శ్రీమహావిష్ణువు స్వరూపం ప్రకాశిస్తూ ఉంటుంది. ఆ నీటిలో తేలుతూ ఉన్న బంగారు మయమైన అండంలో మహానుభావుడు, జన్మే లేనివాడు, శ్రీహరి, దేవాధిదేవుడు, విశ్వవిజేత ఐన శ్రీమన్నారాయణుడు ప్రవేశించి ఆకాశాన్ని భేదించాడు. ఆయన ముఖం నుండి వాణి, అగ్ని పుట్టాయి. ముక్కు నుండి ప్రాణాలు, ఘ్రాణేంద్రియం, నాసిక పుట్టాయి. ఆ నాసిక నుండి వాయువులు, ప్రాణ వాయువులు ఆవిర్భావం చెందాయి. ఆ ప్రాణ వాయువుల నుండి నేత్రాలు, వాని నుండి సూర్యుడు పుట్టారు. దాని యందు ధ్యానం ఏర్పడగా, చెవులు పుట్టాయి. ఆ చెవుల వల్ల చర్మమూ, దిక్కులూ పుట్టాయి. చర్మం వల్ల గడ్డం, మీసాలు మొద లైన రోమరాజి, ఓషధులు పుట్టాయి.

"ఆ తర్వాత మూత్రావయవం,



శ్రీమతి తిరుమల నీరజ

దాని వల్ల రేతస్సు, దాని వల్ల జలం పుట్టాయి. ఆ పైన మలవిసర్జక అవయవం, అపానం జనించాయి. దాని వల్ల మృత్యువు పుట్టింది.

"విరాట్పురుషుని చేతుల వల్ల బలం, ఆ రెండిటి చేతులు, బలం వల్ల ఇంద్రుడు, పాదాల వల్ల గమనం, నడక, ఆ రెండిటి వల్ల ఉపేంద్రుడు జన్మించారు. ఆ విరాట్పురుషుని నాడుల వల్ల రక్తం, దాని వల్ల నదులు, జఠరం వల్ల ఆకలిదప్పికలు, ఆ రెండిటి వల్ల సముద్రాలు పుట్టాయి.

"అమ్మా! త్రిగుణాలతో నిండి ప్రకృతి వల్ల ఏర్పడిన శరీరాన్ని పొందినా, పురుషుడు వేటి పట్లా అనురక్తుడు కాకుండా, వికారహీనుడై, త్రిగుణాతీతుడై ఉంటాడు. నిర్మలజలాలలోని దినకరుని ప్రతిబింబాన్ని జలం అంటని విధంగా త్రిగుణాలు పురుషుణ్ని అంటవు. ఆ ప్రకారం కాక, జీవుడు ప్రాకృతికగుణాలలో తగులుకొని, అహంకారంతో మూఢుడై అన్నిటికీ తానే కర్తనని ప్రవర్తిస్తే, ప్రకృతిదోషాలు పొందుతాడు.

వాటి వల్ల సుర, నర, పశు, పక్ష్యాది నానావిధరూపాలను పొందుతూ, కర్మవాసనల చేత సంసారబంధంలో చిక్కుకొని పోతాడు. ఆ చిక్కులలోనే సంచరిస్తూ, విషయసుఖాలనే తలచుకొంటూ, కలలో సంపదలు పొందినట్లుగా అందులో మునిగి తేలుతూ చంచలమనస్కుడై తిరుగుతూ ఉంటాడు. కనుక మోక్షం కోరుకొనే సాధకుడు, తీవ్ర మైన భక్తియోగంతో

# భాగవతంలో భగవంతుని అవతార గాథలు

విరక్తి చెంది, యమనియమాది యోగక్రియలను అభ్యసించి, మనసును వశం చేసుకోవాలి.

"మోక్షార్థి శ్రద్ధతో నా నిజస్వరూపస్వభావాలను గ్రహించి, నా పాదాలను సేవించాలి. నా కథల వర్ణనలు వింటూ భూతాలన్నిటి పట్ల సమతను పాటిస్తూ శత్రుత్వం లేకుండా ఉండాలి. బ్రహ్మచర్యం, మౌనం, మితభోజనం, ఏకాంతవాసం, మననశీలతలతో ఉంటూ మాత్సర్యం విడచిపెట్టాలి. స్నేహం, దయ వీటిని సంపూర్ణంగా అదుపులో పెట్టుకొని ఆత్మజ్ఞాని కావాలి. శరీరం మీద, బంధువుల మీదా మమకారం తగ్గించుకోవాలి. సాధనతో శ్రీమన్నారాయణుని దర్శనం కలుగుతుంది. అప్పుడు అహంకారం నశించి పరబ్రహ్మాన్ని దర్శించుకోగలుగుతాడు"

ఆ పైన తల్లి కోరికపై యోగధర్మాలను కపిలమహర్షి వివరించాడు. అటు పిమ్మట భక్తియోగం తెలియజేశాడు. పిండోత్పత్తి క్రమాన్ని, గర్భవాసనరకాన్ని చెప్పాడు. ఆ తర్వాత తాను చెప్పినదాని మీది ప్రగాఢవిశ్వాసంతో గట్టిగా ఆచరించ మని ఉపదేశించి, ఆ అనుష్ఠానం వల్ల తప్పక జీవన్ముక్తి కలుగుతుందనీ, అనాదరం చూపితే మృత్యుభయం కలిగి సుఖం దూరమవుతుందనీ చెప్పాడు. ఆ ఉపదేశం తర్వాత ఆయన తపస్సుకు వెళ్లిపోయాడు.

దేవహూతి పుత్రుడా విధంగా ఉపదేశించిన దాన్ని మనస్పూర్తిగా స్వీకరించి తపస్సు ప్రారంభించింది. క్రమంగా బ్రహ్మజ్ఞానం సాధించుకొన్నది. ఆ పరబ్రహ్మలో చిత్తాన్ని నిలపటం వల్ల జీవభావం తొలగిపోయి, తత్త్వజ్ఞానం అలవడింది. బ్రహ్మసమాధి సిద్ధించి పునరావృత్తిరహితమైన మళ్లీ జన్మ లేని స్థితి, ప్రవృత్తి ఏర్పడింది. పుత్రుడు కపిలమహర్షి చెప్పిన దారిలో ఆ దేవహూతి శ్రీహరిలో లీనమైంది.

ఇక తరువాతి దైన దత్తాత్రేయుని అవతారం గురించి చెప్పుకుందాము.

మునివరులలో శ్రేష్ఠుడు అత్రిమహాముని. ఆయన భార్య అనసూయాదేవి. ఇరువురూ ఘనకీర్తి గలవారు. అనసూయ దత్తాత్రేయుడు, దుర్వాసమహర్షి, చంద్రుడు అనే ముగ్గురు కుమారులను పొందింది. వారు క్రమంగా విష్ణువు,



సదాశివుడు, బ్రహ్మదేవుల అంశలతో జన్మించినవారు. ఈ ముగ్గురూ గొప్ప యశస్సును పొందారు.


దేవతలలో ఉత్తములైన బ్రహ్మవిష్ణుమహేశ్వరులు సృష్టి స్థితి లయలకు కారణభూతులు కదా, అలాటి ఆ త్రిమూర్తులు, వారు ఏమి చేయగోరి ఆ అత్రిమహాముని ఇంట అవతరించారు? అనే అనుమానం, కుతూహలం అందరికీ కలుగుతాయి. భగవద్భక్తులకైతే మరీ ఎక్కువగా కలుగుతాయి. ఆ వృత్తాంతాన్ని వివరంగా తెలుసుకొందాము. (సశేషం) ★



ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో స్వామి వారి కళ్యాణోత్సవాలలోని చిత్రం.

# సత్సంప్రదాయ పరిరక్షణ సభ







వేద ధర్మాన్ని వైదిక వాఙ్మయాన్ని ప్రచారం చేసి ప్రాచీన సాంప్రదాయ జ్ఞాన సంపదను కాపాడటానికి మన పెద్దలు ఎన్నో సంస్థలను ఏర్పాటు చేశారు.

భగవద్ రామానుజాచార్యులచే ప్రతిపాదితమైన సత్ సాంప్రదాయాన్ని పరిరక్షించడం లక్ష్యంగా ఋషితుల్యులైన శ్రీమాన్ శ్రీ నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్యుల వారిచే "సత్సంప్రదాయ పరిరక్షణ సభ" సంస్థ వరంగల్ ప్రధాన కేంద్రంగా 10-6-1987 బుధవారం ప్రభవ సంవత్సర జ్యేష్ఠ శుక్ల త్రయోదశి శుభదినమందు స్థాపించబడింది. వ్యవస్థాపక అధ్యక్షులు మహా మహోపాధ్యాయ కవి శాబ్దిక కేసరి శాస్త్ర రత్నాకర శ్రీ ఉ వే శ్రీమాన్ డాక్టర్ నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్య స్వామి వారు. సంప్రదాయ ప్రచార వైభవంలో పూర్వతరానికి నేటితరానికి వారధిగా నిలిచిన మహానుభావులు. జీయర్ స్వాములకు సూచనధారిగా ఉన్నారు. సంస్కృత భాషా పండితులై సాహిత్య వేద వేదాంగాలను అధ్యయనం చేసి గ్రంథ రచన, పాఠ ప్రవచన, ధార్మిక వేదాంత శాస్త్ర విషయ ప్రబోధములతో తమ జీవితాన్ని కొనసాగించారు. ఎంతోమంది పండితులు, విద్వాంసులు, మఠాధిపతులు శిష్యులుగా గల వీరు 1926 మే 1న జన్మించారు. 2018 అక్టోబర్ 13న పరమపదం వేంచేశారు. వారు రాష్ట్రపతి అవార్డుతో పాటు అనేక బిరుదులను, సన్మానాలను పొందిన లబ్ధ ప్రతిష్ఠులు.



వ్యవస్థాపక కార్యదర్శి ప్రొఫెసర్ నల్లాన్ చక్రవర్తుల పట్టాభి రామాచార్యులు గారు. సంస్థ గౌరవాధ్యక్షులు శ్రీమత్ పరమహంస పరివ్రాజకాచార్యులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారు.

ఈ సంస్థకు అనుబంధంగా సంస్కృత విజ్ఞానవర్ధిని ప్రచార సభను కూడా ఏర్పాటు చేశారు. తొంబై రెండు సంవత్సరాల వయోవృద్ధులయ్యే వరకు ఈ సంస్థల ద్వారా వారు చేసిన సేవా కార్యక్రమాలు, సిద్ధాంత ప్రచారము అనన్య సామాన్యము. నేటికీ సంస్థ కార్యకలాపాలు చక్కగా సాగుతున్నాయి అంటే వారి శిష్య పరంపర, వారు ఏర్పాటు చేసిన వ్యవస్థ ప్రధాన కారణములు. ఎంతో మంది సహృదయుల సౌజన్యంతో సాగుతున్న సాంప్రదాయ పరిరక్షణ సంస్థ ద్వారా అనేక గ్రంథాలు ముద్రిత మవుతున్నాయి. శ్రీమాన్ రఘునాథాచార్యులు రచించినవే వందకు పైగా గ్రంథాలు ప్రచురించబడ్డాయి. ఎంతోమంది సంప్రదాయ పండితులకు రఘునాథ దేశిక అవార్డు ప్రదానము, ఉభయ వేదాంత సభలు, తిరుప్పావై సదస్సులు, పురాణేతిహాస వాఙ్మయ సమీక్షలు ఇలా అనేక కార్యక్రమాలు నిర్వహించబడుతున్నవి వర్ధమాన ప్రవచనకారులను సిద్ధం చేసే దిశగా సేవా కార్యక్రమాలు సాగుతున్నాయి. ప్రస్తుతం ఈ సంస్థ బాధ్యతలు నిర్వర్తిస్తున్న వారు అధ్యక్షులు ఉ.వే.ప్ర శ్రీమాన్ సముద్రాల పురుషోత్తమాచార్యులు ప్రధాన కార్యదర్శి ఉ.వే.ప్ర శ్రీమాన్ సముద్రాల శఠకోపాచార్యులు (ఫోన్ నెంబర్ 98483 73067)

సభ ఆశయములు:

(మిగతా 31 వ పేజీలో)

# కౌసల్యా మాత మందిరం


ఎక్కడుందో తెలుసుకుందామా ?



సకల కళ్యాణ గుణాభిరాముడు, సత్యవాక్ పరిపాలనా దక్షుడు, మర్యాదా పురుషోత్తముడు మరియు సాక్షాత్ పరబ్రహ్మ అయినటువంటి శ్రీరామ చంద్రుడిని పన్నెండు మాసాలు మోసి కన్నతల్లి కౌసల్యా మాత అనే విషయం మనందరికీ తెలుసు. కులశేఖరాళ్వార్ తమ ప్రబంధంలో "శ్రీరాముణ్ణి మన్ను పుగళ్ కౌశలై" అంటూ స్థిరమైన కీర్తి కలిగిన కౌసల్యా మాత కుమారునిగా సంబోధించటం అలాగే వాల్మీకి మహర్షి "కౌసల్యా సుప్రజా రామ పూర్వాసంధ్యా" అంటూ కౌసల్యా పురస్సరంగా శ్రీరాముడిని సంబోధించటం అనేవి "మాతృ దేవోభవ" అనే వేద వాక్యానికి అద్దం పడుతున్నాయి. మరి అటువంటి మహాతల్లి ఆలయం ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర రాజధాని రాయ్‌పూర్ నగరం నుండి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ ఆలయం చంద్ఖురి అనే గ్రామం చుట్టూ ఉన్న సరస్సు మధ్యలో ఉంది. అక్కడ హనుమాన్ విగ్రహం ఉన్నటువంటి హనుమాన్ పుల్ అనే వంతెనపై నడవడం ద్వారా కౌసల్యా మాత ఆలయాన్ని చేరుకోవచ్చు.

**శ్రీమాన్ శ్రీ డా.వోలేటి రవికుమారాచార్యులు**





ఈ ఆలయంలో శ్రీ రాముడిని తన ఒడిలో ఉంచుకున్న కౌసల్యా మాత విగ్రహం ఉంది. ఈ ఆలయం 8వ శతాబ్దంలో నిర్మించబడిందని భావిస్తున్నారు. ఆలయం చాలాసార్లు పాడైపోయి పునర్నిర్మించబడింది. 19వ శతాబ్దం ప్రారంభంలో కూడా ఈ ఆలయాన్ని పునరుద్ధరించారు. కొన్ని శతాబ్దాల చరిత్ర కలిగినటువంటి ఈ ఆలయాన్ని, సుమారు ముప్పై రెండు కోట్ల వ్యయంతో పునర్నిర్మించి అన్ని సదుపాయాలు కల్పించటంతో పాటుగా శ్రీరాముడి వనవాస సమయంలో ప్రాముఖ్యతను సంతరించుకున్న మరికొన్ని స్థలాలను అయోధ్య వరకు అనుసంధానము చేసి "రామ్ వన్ గమన్ పథ్" గా ప్రారంభించాలనే సంకల్పం వార్తా కథనములలో మనం గమనించవచ్చు.

ప్రపంచంలోని ఏకైక కౌసల్యా మాత ఆలయం కల ప్రదేశం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని చంద్ఖురి అనే నగర పంచాయితీ. త్వరలో భక్తులందరూ కౌసల్యా మాత ఆలయాన్ని అధిక సంఖ్యలో సేవించగలిగే అవకాశం కలగాలని ఆశిస్తూ.....★

## శ్రీమద్రామాయణ విశేష ప్రవచనాలు

ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకారులు ఉభయ వేదాంత పండితులు శ్రీమాన్ శ్రీ డాక్టర్ ఓలేటి రవికుమారాచార్యుల వారిచే "శ్రీమద్రామాయణ వైభవ విశేష ప్రవచనాలు" మార్చి మాసంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహింపబడ్డాయి. 23న సూర్యాపేటలోని భగవద్గీత మందిరంలో 24న ఆత్మకూరులో. 30 31 వ తేదీలలో బాసరలోని జ్ఞాన సరస్వతీ ఆలయ సమీపంలోని శ్రీ లక్ష్మీనరసింహ నిలయంలో వైభవంగా నిర్వహింపబడ్డాయి. ★






# విదురుని ధర్మనిష్ఠ

## తిరుక్కోళూర్ పెన్ పిళ్ళై రహస్యాలు

తిరుక్కోళూరు పెన్పిళ్ళై పలికిన 81 వాక్యరత్నములలో రెండవ భాగవతోత్తముడైన విదుర మహాశయుని గూర్చి ఆమె పలికిన పలుకులు.

"అగ మొజిత్తు విట్టేనో విదురరై పోలే"

శ్రీకృష్ణుడు రాయబారిగా హస్తినాపురం వెళ్ళినప్పుడు భీష్మ ద్రోణాదులు, విదురాళ్వాన్ అతనికి ఎదురేగి ఆహ్వానించారు. ఒక్కొక్కరి ఇల్లు చూస్తూ కణ్ణపిరాన్ (శ్రీకృష్ణుడు) "ఇది ఎవరి ఇల్లు?" అని అడుగుతున్నారు. వారంతా వివరిస్తున్నారు. ఆ ఇల్లు ఎవరిది అని ఒక ఇల్లుని చూసి శ్రీకృష్ణుల వారు అడగగా దానికి విదురుడు "ఇది దేవర వారి తిరుమాళిగ" అని పలికాడు. కృష్ణుడు "ఆహా! ఈ హస్తినాపురంలో కూడా నాకు ఒక ఇల్లు ఉన్నదా" అంటూ సంతోషముగా ఆ ఇంటిలోనికి ప్రవేశించారు. అది విదుర మహాశయులు నివాస గృహము. తన నివాసమును భగవానునిదిగా తలచి నేను నాది అనే మమకారాన్ని వదిలిన వారు విదురులు. సాక్షాత్తు యమధర్మరాజు యొక్క అంశతో జన్మించిన వాడు విదుర మహాశయుడు. పంచమ వేదమైన మహాభారతంలో చూసినట్లయితే విదురుని యొక్క వైశిష్ట్యం మనకు తెలుస్తుంది. ఆయన గొప్ప ప్రణాళిక నిర్మాత. ఎలా అంటే శ్రీరామాయణంలో రామచంద్రుని యొక్క ధర్మనిరతికి, సమానమైన ధర్మాలను అందించిన మహాత్ముడు విదురుడు. ధృతరాష్ట్రునికి మంత్రిగా నిరంతరం ధర్మ బోధనలు చేస్తూ మంచి మార్గాన్ని చూపించేవాడు. ఇంద్రప్రస్థం నిర్మించుకున్న పాండవుల వద్దకు విదురుని పంపి ద్యూతక్రియకు రమ్మని ఆహ్వానించి వారిని వెంటపెట్టుకొని రావలసిందిగా ధృతరాష్ట్రుడు ఆజ్ఞాపిస్తాడు. "ధర్మాధర్మాలు తెలియని నీ పిల్లల మాటలు విని అధర్మానికి పాల్పడవద్దు" ని మంచిని చెబుతాడు విదురుడు కానీ ఆమోదించడు ధృతరాష్ట్రుడు. ఆ ద్యూత క్రియలో పాండవులు ఓడిపోయిన తర్వాత దుర్యోధనుడు విదురుని పిలిచి తన పడకగదిని ద్రౌపదిచేత శుభ్రం చేయించమని చెబుతాడు. మదోన్మత్తుడైన దుర్మార్గుడు దుర్యోధనుడు. ధర్మాత్ముడైన విదురుని మనసు బాధ పెట్టినందుకు దిక్కులేని చావును పొందాడు. దుర్యోధనుడు పునః ద్యూతంలో పాండవులు ఓడి పోయి అరణ్యవాసం వెళ్లే సమయంలో కుంతీదేవిని తన ఇంట్లో ఉంచుకొని విదురుడు వదిన గారిని దుర్మార్గుడైన



**శ్రీమతి మహాలక్ష్మీ రాణి గుండు, రాజమండ్రి.**

దుర్యోధనుని చేతి అన్నం తినకుండా, ధృతరాష్ట్రుని నీడన ఉంచకుండా, అరణ్యంలో కష్టాలు పడకుండా కుంతీమాతను తన రక్షణలో కాపాడి మనుష్య ఋణం తీర్చుకున్న మహానుభావుడు. పాండవులకు కూడా వనవాస సమయంలో ధర్మజుని చూచి "ధర్మపరులైన మీరు ఎక్కడ ఉన్నా మీకు మేలు జరుగుతుంది మీ ధర్మం మిమ్ములను కాపాడుతుంది" అని శ్రీరామాయణంలో కౌసల్యమ్మ శ్రీరామునికి ధర్మాచరణ చేయమని చెప్పి రక్ష పెట్టినట్లుగా విదురుడు కూడా "మీ ఐదుగురిని ఈ పృథ్విలో ఎవరు జయించలేరని విజయం మీదే!" అని రక్ష పెట్టాడు. "రాజ్యలక్ష్మి నడిచి వస్తుంది మీ వద్దకు" అంటాడు. పాండవులు వనవాసం నుండి తిరిగి వచ్చారన్న వార్త విన్న ధృతరాష్ట్రునికి ఆ రాత్రి నిద్ర రాలేదు. విదురుని కబురంపాడు రమ్మని. రాజాజ్ఞకు కట్టుబడ్డవాడు కనుక వెంటనే బయలుదేరి రాజమందిరానికి వస్తాడు విదురుడు. నాలుగు కారణాల వలన నిద్ర రాదు ఎవరికైనా అంటూ ఎన్నో విధాల ధర్మ వాక్యాలను బోధించి, రాజ్యాన్ని పరిపాలించాలి అంటే ప్రభువుకు కొన్ని ప్రధాన లక్షణాలు ఉండాలి. ఆ గుణములు ఏమిటంటే మొదటి లక్షణం తన గురించి తాను తెలుసుకోగలగాలి. తన బలం తన బలహీనత కూడా తనకు తెలిసి ఉండాలి. సరైన అవగాహనతో ఉండాలి కదా రాజైనవాడు! తన ధర్మం తన తమ్ముళ్లు తన భార్య ఇవన్నీ ధర్మరాజు బలం నీ బిడ్డలకు బలం ఎవరు? శకుని కర్ణుడు వీరే కదా! వారు ఎంతటి వారో తెలుసును నీకు!

# విదురుని ధర్మనిష్ఠ

తొందరపాటు తగదు రాజైన వానికి ఉండాల్సిన లక్షణం దాన్ని బయటకు తెలియకుండా దాచగలగాలి. ప్రజలకు ఆదర్శవంతమైన ప్రభువుగా ఉండాలి.దార్శనికుడు కావాలి ప్రభువు.వదిన గారిని జుట్టు పట్టి ఈడ్చుకొని సభకు తీసుకు వచ్చిన వాడు నీ కొడుకు దుశ్శాసనుడు. పక్కన కూర్చోమని సైగ చేసిన వాడు దుర్యోధనుడు. కులకాంత అయిన ద్రౌపదిని దుర్భాషలాడిన వాడు కర్ణుడు. దొంగ జూదమాడిన వాడు శకుని. వీరు పరిపాలకులు కారు అటువంటి వారి వద్ద రాజ్యలక్ష్మి ఉండదు. ఈ అధర్మమే నీ నిద్రలేమికి కారణం! అని సున్నితంగా మందలించాడు.

ప్రభువు ఎప్పుడు సూర్యుడిలా ఉండాలి. వేసవి రాగానే సముద్రంలో నీటిని చిన్నచిన్న గుంటలలో నీటిని అంతటినీ పీల్చేసుకుంటాడు. అదే సూర్యుడు వర్షాకాలంలో ఒక్క చుక్క కూడా దాచుకోకుండా వర్షించి చెరువులు దరువులు అన్ని నింపేస్తాడు. అలా రాజుకు రెంటి యందు సమభావం ఉండాలి. అలాంటి ఏ లక్షణాలైనా నీ బిడ్డలలో ఉన్నవా? లేవని నీకు తెలుసు కదా! అంటూ హితవాక్యాలు చెబుతున్నాడు విదురుడు. ఇవే విదురనీతులు. ప్రతి మనిషికి సంస్కార బలాన్ని ఇస్తాయి. శ్రీకృష్ణ పరమాత్మ కూడా ఎవరు వీటిని పాటిస్తారా, వింటారా అని చూస్తుంటాడట!

ఏ పనులు మనం చేస్తే అవతలి వారు మంచి మార్గాన్ని అవలంబిస్తారో అవి చెయ్యాలి. అవతలి వారు కష్టాల్లో ఉంటే ఆదుకునే సంస్కారం ఉండాలి. ప్రేమ శాశ్వత పరిణామాన్ని తెస్తుంది. సమాజమును దేవాలయము చేసి నీవు చేసేది సమాజ హితం అనుకొని చేయాలి. కాపురుష గుణాలు ఉండకూడదు. అంటే ఎవరిలోనూ మంచిని చూడకపోవటం, దురభిమానం నిర్వ్యాపారత్వము ఇవి దుర్జనగుణాలు. నీటితో చల్లార్చినట్టుగా అంతః పరిశీలనము చేత తన కోపాన్ని తాను తగ్గించుకున్న వాడు ధన్యుడు.

"నీకున్న వాటిని చూసుకొని ఆనందిస్తూ ఈశ్వరానుగ్రహంగా భావించాలి. ఆయా సుఖదుఃఖాలు రెంటికి భగవంతుడే కారణం అన్న విషయం తెలుసుకోవాలి. ఇది అలవర్చుకోకపోతే అదే కాపురుష లక్షణం. లేకపోతే జీవితంలో ముందుకు పోలేదు" అంటాడు. అర్థం లేని గర్వం ప్రమాదహేతువు. ఎవరిని చూసినా ఏవగింపు తత్వం, నేను అన్న గర్వంతో ఉండడం వలననే ఎద్దు జన్మ వస్తుంది సప్తధాతువులలో ఉన్న ఈ శరీరం నాది అన్నది కాక భగవత్ ప్రసాదంగా భావించిన నాడే యథార్థజ్ఞానం కలుగుతుంది. అన్యాయంగా ఆర్జించిన ధనం వలన ఏ చిన్న ఆపద వచ్చినా కూడా అధికమైన భయం కలుగుతుంది. సుఖంగా నిద్ర పోలేడు. తృప్తి మనసులో ఉంటేనే ధర్మం గోచరిస్తుంది భగవత్సంబంధం వలన దురభిమానం విరిచేస్తుంది మనసు ప్రభావం ఊపిరి మీద ప్రభావితం అవుతుంది. అందుచేత మనసులను నిగ్రహించుకోవాలి. అదే ఉద్ధరణకు హేతువు అవుతుంది. ఆవు పాలు పితికే వారు ఎంత శ్రద్ధతో పిండుకుంటారో ప్రాజ్ఞులైన వారి నుండి అలా తెలుసుకోవాలి. నిరంతరం మనస్సు సత్వము రజస్సు తమస్సు అని మూడు గుణాల సంపర్కంతోనే ఉంటుంది. కనుక మనసును ధర్మము అర్థము కామము అనే పురుషార్థముల యందు నిలుపగలిగిన రోజు మోక్షం అనే పురుషార్థం లభిస్తుంది. మొదటిదైన ధర్మానికి అర్థాన్ని కామాన్ని జోడించి మనసు నిలిపినట్లైతే నాలుగవ పురుషార్థమైన మోక్షము లభిస్తుంది. తద్వారా మనస్సు పంచేంద్రియాలను అదుపు చేసుకోగలుగుతుంది.

అప్పుడు పంచేంద్రియాలు మనసు కలిసి ఆరుగా మారి ఒకటి అవుతాయి. దానికి సాధన అవసరం అదే ధ్యానావస్థ. అది ఆనందమయమైనది. సప్త ధాతువులతో కూడిన ఈ శరీర సంబంధం దాటి ఎనిమిది అయిన సమాధి స్థితి కలుగుతుంది. అదే యోగులు అనుభవించే ఆనంద స్థితి అదే నిత్యము అదే బ్రహ్మానందం.

అలా విదురుడుణ ధృతరాష్ట్రునికి తెలియజేస్తున్నట్లుగా లోకానికి నీతిని ధర్మాన్ని అందించిన మహానుభావుడు. అని చెప్తూ తిరుక్కోళూరు అమ్మాళ్ విదురుని గూర్చి భగవద్రామానుజులకు తెలియజేసింది. తనకు విదురుని వలె నేను నాది అనేది పోలేదు కదా! అందుకే తాను తిరుక్కోళూరులో ఉండతగను అని నైచ్యానుసంధానం చేసింది. ఆచార్య నిష్ఠ, జ్ఞాన భక్తి వైరాగ్యములు ఏమీ లేవు అంటూనే అన్ని చరిత్రలు, జరగబోయే విషయాలు కూడా పలికింది. దీంతో ఆమె ఎంతటి అనుష్ఠాన పరురాలో, భక్తిలో ఎంతటి పరాకాష్ఠను కలిగి ఉన్నారో మనకు తెలుస్తోంది. రెండవ భాగవతోత్తములు విదురుల గురించి తెలుసుకున్నాము. మూడవ భాగవతోత్తముల గురించి తర్వాత సంచికలో తెలుసుకుందాము.

★

# శ్రీమత్ క్రోధి నామ సంవత్సర

# ఫలితాంశములు



శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి

ఈ సంవత్సరము చైత్ర వైశాఖములయందు ఎండలు హెచ్చుగాను అక్కడక్కడ శిలాసహిత వృష్టియు స్ఫోటకాగ్ని భయములు కలరా వ్యాధులు ప్రబలును జ్యేష్ఠాషాఢ మాసముల యందు గ్రీష్మాధిక్యతయు సస్యానుకూల వృష్టియు దుర్భిక్ష భయోత్పాతములు ధరలు సరసము శ్రావణ భాద్రపద మాసముల యందు ఖండవృష్టియు ఆహార పదార్థముల ధరలు పెరుగును. రస చలి పదార్థముల ధరలు సరసము ఆశ్వయుజ కార్తీక మాసముల యందు తుఫాను వర్షములు ఆరంభము మార్గ శీర్షాది చాతుర్మాస్యముల యందు మంచు వర్షములు చలియధికము ధాన్యాదుల ధరలు పెరిగి నిలబడును. రోగ భయము ఉత్పాతములు గాలి దుమారములు వచ్చును. రాజు కుజుడు మంత్రీ సేనార్ఘ మేఘాధిపతి శనియై సస్యనీరసాధిపతి కుజుడై ధాన్యాధిపతి చంద్రుడై రసాధిపతి గురువైనందున సంవత్సరమంతయు ఆహారధాన్యముల ధరలు పెరుగును అచ్చటచ్చట హెచ్చుతగ్గులుండును. రాజులు ప్రజలు పరస్పరము కలహించెదరు. లోకమున అగ్ని శస్త్ర భయములు పంటలు తగ్గుటయు ప్రజా కల్లోలములు ప్రజా వ్యతిరేకతలు ఆకలిబాధయు ప్రజలు రోగపీడితులగుదురు. క్రోధ లోభ పరాయణులై రాజులు ప్రజాపీడనుగావించెదరు. భూకంపాది ప్రకృతి వైపరీత్యములు ఈతిబాధలు అల్పవృష్టియుండుటచేత సస్యములు మధ్యమ ఫలదములు కుటుంబకలతలు విరోధము లధికము. రాజకీయ వడిదుడుకులు లోకమున పాపము ప్రబలి ప్రజలు క్రూరకర్మలు చేయుదురు. నాస్తికవాదము ప్రబలును రాజకీయ కల్లోలములు చోరరోగాగ్ని భయములు. చోరులు, దుర్మార్గులు ప్రబలుదురు. రాజులు పరస్పరము జయకాంక్షచే యుద్ధము చేయుదురు. సైన్యముచాలావరకు నశించును. లోకమున భయోత్పాతములధికము నావికలు సముద్రమున ముంచివైచుట ప్రజలు ధన మాన ప్రాణహానులు కల్గియుందురు. వ్యాపార వడిదుడుకులు రవాణా సౌకర్యములు తగ్గును ప్రభుత్వమునకు ప్రజల సహకారము అంతంతమాత్రమే మద్యపానము నివారించుటకు తగు నిర్ణయములు తీసుకోవచ్చును రోడ్డు రైలు ప్రమాదములధికము నాయకులకు గడ్డుకాలము ప్రపంచములోనే క్రీడారంగము మొదటి స్థానములో వుండును. దేవాలయములు పర్యాటకక్షేత్రములు అభివృద్ధిలో నుండును. ఇతర మతశక్తులకు యుక్తులు పనిచేయకుండా కేంద్రప్రభుత్వము సమర్థ వంతముగాఉండి కఠిన నిర్ణయములు తీసుకొందురు. ప్రయివేటు చానళ్ళు తగ్గును ప్రభుత్వ చానళ్ళ అధికారము పెరుగును.

## ఆచార్యవైభవమ్

(12 వ పేజీ తరువాయి) ప్రకాశించడమే కాక ఆచార్యుని సన్నిధిలో నేర్వని, సంప్రదాయ సిద్ధమైన విషయాలు కూడా మనసులో భాసిస్తాయి? అనే విలక్షణమైన అర్థం ఇక్కడ వ్యక్తమవుతున్నది. ఆచార్యుని సన్నిధిలో ఏవో కొన్ని శాస్త్రాలు చదివినప్పటికీ, అన్నీ సమగ్రంగా ఆచార్యుని సన్నిధిలోనే అధ్యయనం చేసే అవకాశం ఎవరికో కానీ కలుగదు. ఆ విధంగా ఆచార్య సన్నిధిలో అన్ని గ్రంథాలను అధ్యయనం చేయక పోయినప్పటికీ, అధ్యయన అధ్యాపన సమయాలలో, తాను అంతకుముందు అధ్యయనం చేయని గ్రంథాన్ని పరిశీలించినప్పుడు, అందులో తాను అంతకుముందు ఆచార్యుని వలన తెలియని మంచి అర్థాలు కూడా ఆ ఆచార్యుని అనుగ్రహంవల్ల లభిస్తాయి అని పైన ఉదాహరించిన సూక్తి తెలుపుతున్నది. ఈ విధంగా, ఆచార్య సన్నిధిలో నేర్వని విషయాలుకూడా మనసులో స్ఫురించాలంటే, ఆచార్యునిలో అచంచలమైన భక్తిని కలిగి ఉండాలి. అటువంటి భక్తి ఉంటే, ఆ విధంగా కొత్త విషయాన్ని కూడా తెలియగలిగే అవకాశం ఏర్పడుతుంది అని ఉపనిషత్ సూక్తి సూచిస్తున్నది. ★

# జ్యోతిర్విజ్ఞానమ్

## శ్రీమాన్ శ్రీ నంబి వేణు గోపాలాచార్య కౌశిక



"గృహాది ద్వార మారభ్య ద్వయాన్తం గృహముత్తమం" ఒక గృహానికి ఒక ద్వారం ఉండటం ద్వారా స్థిరమైన ఆలోచన లేనివాళ్ళు అవుతారని, రెండు ద్వారములు ఉంటే ఉత్తమ గృహంగా కీర్తించబడుతున్నది. 'గృహాది ద్వార తృతీయే శత్రువృద్ధి కరంభవేత్' మూడు ద్వారాలు ఉంటే ఆ గృహము శత్రువులకు నిలయమవుతుంది. 'దీర్ఘాయుష్యం చతుర్ ద్వారం' నాలుగు ద్వారాలు ఉంటే ఇంట్లో ఉండే వారు పరిపూర్ణమైన ఆయుర్దాయం కలిగి ఉంటారు. మృత్యురోగాది పంచకం ఐదు ద్వారములు ఉంటే రోగాల చేతగాని మృత్యు బాధ చేతగాని వాళ్ళు ఫలాన్ని అనుభవిస్తారని, 'షష్ఠం పుత్ర లాభం చ' ఆరు ద్వారములు ఉంటే చక్కని సంతానవంతమైన గృహం అవుతుంది. 'సప్తమం మృత్యు కారకం' ఏడు ద్వారాలు ఉంటే ఆ గృహానికి మృత్యుబాధ ఉంటుంది. 'అష్టమం సర్వ సౌభాగ్యం' ఎనిమిది ద్వారాలు ఉంటే సౌభాగ్యం కలిగి ఉంటుంది. 'నవమం గృహదాహకం' తొమ్మిది ద్వారాలు ఉంటే ఎప్పుడో ఒకసారి అగ్ని, చోరాది భయాలు వుంటాయి. 'దశమం ద్వారాశోభం చ' పది ద్వారాలు ఉంటే అది శుభ దాయకమైన గృహము కాకుండా ఉంటుంది. ఆ ఇంట్లో అనేకమైన ఇక్కట్లతో జీవించవలసి వస్తుంది. అంటే పది సంఖ్య సున్నాతో కూడిన సంఖ్య పనికిరాదు. 'ఏకాదశం ధనక్షీణం' పదకొండు ఉంటే ధనం కరిగిపోతుంది.'ద్వాదశం శత్రునాశనం' పన్నెండు ద్వారాలు ఉంటే ఆ ఇంటికి శత్రుభయం ఉండదు. 'త్రయోదశం మృతంశీఘ్రం' పదమూడు ద్వారాలు ఉంటే అల్పాయుష్కులై ఉంటారు ఆ ఇంట్లో. 'చతుర్దశం సంపత్కరం' పద్నాలుగు ద్వారాలు ఉంటే సంపద చేత ఆ గృహము విరాజిల్లుతూ వుంటుంది.'పంచదశే నమోక్షంచ( పదిహేను ద్వారాలు కలిగిన గృహంలో ఏ నిర్ణయం కూడా శీఘ్రంగా తీసుకోలేరు అనే విషయాన్ని చెబుతుంది. 'షోడశం శుభదాయకం( పదహారు ద్వారాలు ఉంటే ఆ గృహంలో శుభపరంపర సాగుతూ ఉంటుంది.

ఈ ద్వార సంఖ్యాతో పాటు ఈ ద్వార స్థానాలను ఏర్పాటు చేసేటప్పుడు కూడా మనం ఈశాన్యం నుంచి ఆగ్నేయం వరకు సుమారుగా ఒక ఇరవై నాలుగు అడుగుల పొడవు ఉంటే దాన్ని మూడు భాగాలు చెయ్యాలి. మొదటి మూడు భాగాలలో మొదటి ఎనిమిది అడుగులు ఈశాన్యం, రెండవ ఎనిమిది అడుగులు తూర్పు, మూడవ ఎనిమిది అడుగులు ఆగ్నేయం. అట్లాగే ఆగ్నేయం నైరుతి వరకు అది 24 అడుగులు వుందనుకోండి! మొదటి ఎనిమిది అడుగులు దక్షిణ ఆగ్నేయం, రెండవ ఎనిమిది అడుగులు దక్షిణం, మూడవ ఎనిమిది అడుగులు దక్షిణ నైరుతి. అట్లాగే నైరుతి నుండి వాయవ్యం వరకు మూడు భాగాలుగా చేస్తే అది మొదటి ఎనిమిది అడుగులు పశ్చిమ నైరుతి, రెండవ ఎనిమిది అడుగులు పశ్చిమము, మూడవ ఎనిమిది అడుగులు పశ్చిమ వాయవ్యం అవుతుంది. అలాగే వాయువ్యం నుండి ఈశాన్యం వరకు అది కూడా 24 అడుగులే అనుకుంటే దాన్ని మూడు భాగాలు చేస్తే మొదటి ఎనిమిది అడుగులు ఉత్తర వాయువ్యం, రెండవ ఎనిమిది అడుగులు ఉత్తరము, మూడవ ఎనిమిది అడుగులు ఉత్తర ఈశాన్యం. అంటే కేవలం స్థలాన్ని మూడు భాగాలు చేసినప్పుడు ఈశాన్య మూల అంటే ఈశాన్యముకు మాత్రమే ఉండదు. చాలామంది ఈ కాలంలో ఈశాన్యం మూలకే వుండాలి ద్వారము అనేది కొందరికి అభిమతం. కాని అలా ఉండాలని శాస్త్రం లేదు. మొదటి ఎనిమిది అడుగులలో అంటే ఈశాన్యం నుంచి ఆగ్నేయం వరకు తూర్పు దిశలో పెట్టే ద్వారం ఉదాహరణ 24 అడుగుల పొడవు ఉంటే మొదటి ఎనిమిది అడుగులలో ద్వారం ఎక్కడ వచ్చినా ఈశాన్యంలో పెట్టినట్లే. అలాగే రెండవ ఎనిమిది అడుగుల తూర్పు అంటే ఈశాన్యం నుంచి 16 అడుగుల లోపల ఎక్కడైనా కూడా ద్వారాన్ని పెట్టుకునే అవకాశం ఉంది. కానీ చివరి ఎనిమిది అడుగుల తూర్పు ఆగ్నేయ ద్వారం శుభ ఫలితాలు ఇవ్వవు. (మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో)

# భరన్యాసము భగవంతుని పైనే భారము

న్యాసదశకములో మనము మొదటి మెట్టులో, శరణాగతి అంటే ఏమిటో తెలుసుకొన్నాము! ఆత్మసమర్పణము చేసుకొనే ప్రయత్నము చేశాము. రెండవ మెట్టులోనూ మూడవ మెట్టులోనూ, శరణాగతిని ఎలా అనుష్ఠించాలో చూశాము. ద్వయమంత్ర పూర్వ భాగమును వివరించుకొన్నాము. ఈ శ్లోకములో కైంకర్య ప్రార్థనను చెప్తున్నారు వేదాంత దేశికులు. అందులో ద్వయమంత్ర ఉత్తర భాగమును వివరిస్తున్నారు.

"శ్రీమన్ అభీష్ట వరద! త్వామస్మి శరణం గతః
ఏతత్ దేహావసానే మామ్, త్వత్ పాదం ప్రాపయ స్వయం"

(లక్ష్మితో కూడుకొని ఉండేవాడా! ఇష్టమైన వరాలను ఇచ్చేవాడా! నిన్ను శరణు పొందిన వాడనై ఉన్నాను. ఈ శరీరం ముగిసిన తర్వాత నన్ను నీవే స్వయంగా నీ పాదాల దగ్గరకు చేర్చుకో)

శరణాగతి చేస్తే పరమాత్మకు ఆనందమే, ఇక్కడ మరొక విచారము వుంది. మంచి మార్గములో వచ్చి, శరణాగతి అనుష్ఠించాడు. కాని శరణాగతిని, ఏ ఫలము ఆశించి చేసాడు? ఇలాగే ద్రౌపది శరణాగతి చేసింది. వస్త్రాన్నర్థించింది. ధర్మరాజు రాజ్యాన్ని అడిగాడు. గజేంద్రుడు పుష్పాన్ని నీచరణాల మీద సమర్పించాలని కోరాడు. విభీషణుడూ రాముని శరణాగతి వేడాడు. లక్ష్మణుడు కైంకర్య సమర్పణమును వేడాడు. ఇలా అందరూ తమ కోరికలను వ్యక్త పరిచే రీతిలో శరణు వేడుతున్నారు. ఇంద్రుడు ఆపద వచ్చినప్పుడల్లా ఆ ఆపదలనుంచి రక్షించమని కోరుతాడు. మరి జీవాత్మలలో చాలా ఆత్మలు అర్థార్థిగా, ఐశ్వర్యార్థిగా, కైవల్యార్థిగా, శరణు కోరుతున్నారు. పరమాత్మ ఎంతో కాలముగా, ఈ జన్మ లోనైనా జీవుడు తనను కోరి రాడా! అని ఎదురు చూస్తూ వుంటారట!. ప్రయోజనాంతరములను అడుగుతాడో! అని చూస్తారుట!

అందుకనే ద్వయమంత్రములో ఉత్తర భాగము పరమాత్మకు జీవుడు "మాశుచః" అంటూ విశ్వాసాన్ని కలిగించిన విధానాన్ని వేదాంత దేశికులు తన నాల్గవ శ్లోకములో కైంకర్య ప్రార్థన ద్వారా తెలుపుతున్నారు.

"శ్రీమన్" అంటూ అపృథక్ మిథునమైన పిరాట్టితో కూడిన నారాయణుని సంబోధిస్తున్నారు ముందు. అభీష్ట వరద కోరిన కోరికలను తీర్చే వరదా! (వరందదాతీతి వరదః) అని పరమాత్మని సంబోధిస్తున్నారు.



ఈ న్యాసదశకాన్ని, కాంచీ పురములో నున్న వరదరాజ పెరుమాళ్ళైన, దేవనాథుని గూర్చి దేశికులవారు సంకలనము చేశారు. ఇక్కడ వరదా! అని పిలిచే పిలుపులోనూ ఈ విషయము స్పష్టముగా తెలుస్తోంది అనుకోవచ్చును.

**శ్రీమతి వంగల రాధిక**

వారు పెరుందేవీ పిరాట్టితో కూడిన దేవరాజపెరుమాళ్, వరదరాజుని, వేడుతున్నారు. ఈ అపృథక్ మిథునమే, అభీష్టవరద. కోరినకోరికలను తీర్చేవారు. అలా కోరికలను ఇంతకుముందు తీర్చినవారని అనడానికి నిదర్శనము ఏది? ఇంతకు ముందు శ్రీరంగపెరియ పెరుమాళ్ అరయర్‌ను వరదరాజ పెరుమాళ్ వద్దకు పంపారు. వారు పాడిన పాశురాలను, దానికి తగిన అరయర్ అభినయ కౌశలములను చూచి తల వూపుతూ ఆనందించారు పెరుమాళ్. ఆ ఆనందములో అరయర్‌కు తన పెరుందేవి పిరాట్టిని తప్ప ఏవరమైనా ఇస్తానని అభయమిచ్చారు. ఆ అరయర్ స్వామి, పెరియపెరుమాళ్ ఆజ్ఞననుసరించి, రామానుజుల వారిని కోరారట. వరదుడు ఉలిక్కిపడ్డారు. అరే తప్పుచేశామే, పిరాట్టితో పాటు రామానుజులను కలిపి వుండవలసినది కదా! అని. కాని వరమిచ్చారు కనుక ఇంక రామానుజ విశ్లేషణ వారికి తప్పలేదు. అలా తమకు అత్యంతప్రియతములైన రామానుజులను, రంగనికి ధారాదత్తముచేసి, వరదుడు, దేవాధిరాజ పెరుమాళ్, త్యాగరాజులయ్యారు.

కూరత్తాళ్వానుకు, పరమాత్మను, రామానుజులను సేవించే అంతర్నేత్రములను ఒసగారు. ఆళ్వాను సంబంధీకులకు మోక్షప్రాప్తి వరమును ఇచ్చారు. రామానుజులు తాను తన ఆచార్యులైన తిరుకోష్ఠియూర్‌నమ్బి మాటను జవదాటి నందుకుగాను, పోగొట్టుకొన్న, తిరు వైకుంఠము, ఆళ్వాను సంబంధముతో తనకు దక్కిందని (మిగతా 25 వ పేజీలో)



# శ్రీరామాయణంలో ఉపకథలు

# గంగావతరణ

ఇక్ష్వాకు వంశంలో పుట్టిన సగర చక్రవర్తికి కేశిని సుమతి అని ఇద్దరు భార్యలు ఉండేవారు. కేశినికి అసమంజసుడు అని ఒక కొడుకు సుమతికి 60,000 మంది కొడుకులు పుట్టారు. అసమంజసుడు ప్రజలను తీవ్రంగా పీడించేవాడు, హింసించేవాడు. వాడి బాధలు పడలేక ప్రజలు రాజు దగ్గర మొర పెట్టుకున్నారు. ఆయన మంత్రుల సలహా మేరకు అసమంజసుని దేశం నుంచి బహిష్కరించారు. ఆ రోజుల్లో పాలకులు ప్రజా సంక్షేమం కోసం పరిపాలించారు. తన, పర భేదం పాటించే వాళ్ళు కాదు. అందువలననే ప్రజా కంటకుడైనవాడు తన కొడుకైనా సరే దేశం నుంచి బహిష్కరించారు.

అసమంజసుని కొడుకు అంశుమంతుడు. ఆయన గొప్ప పరాక్రమశాలి ప్రజలకు ప్రీతిపాత్రుడు. కొంతకాలానికి సగర మహారాజు యజ్ఞం చేయడానికి తల పెట్టి అందుకోసం యజ్ఞాశ్వాన్ని వదిలాడు. ఇంద్రుడు మాయా శరీరం ధరించి యజ్ఞాశ్వాన్ని పట్టుకొని పాతాళంలో ఉన్న కపిల మహర్షి ఆశ్రమం దగ్గర కట్టి వెళ్ళిపోయాడు. తండ్రి ఆజ్ఞాపించడం చేత యజ్ఞాశ్వాన్ని వెతుకుతూ సగరుడి 60 వేల మంది కొడుకులు పాతాళం దాకా భూమిని తవ్వుకుంటూ వెళ్లారు. ఒక్కొక్కరు ఒక యోజనం విస్తీర్ణం గల భూమిని తవ్వుకుంటూ వెళ్లారు. దారిలో వాళ్ళకు ఎదురుపడ్డ వాళ్ళందరిని చంపుకుంటూ వెళ్లారు. అందు వలన ఇబ్బందులు పడ్డ దేవతలు, గంధర్వులు, అసురులు, నాగులు, అందరూ బ్రహ్మ దగ్గరకు వెళ్ళి జరిగిందంతా చెప్పి తమను కాపాడమని మొరపెట్టుకున్నారు. వాళ్ళని చూసిన బ్రహ్మ 'ఈ చరాచర ప్రపంచానికంతా సర్వశక్తిమంతుడైన శ్రీమహావిష్ణువే స్వామి. ఆయన కపిల మహర్షిగా అవతరించి ఈ భూభారాన్ని మోస్తున్నాడు. ఆయన కోపాగ్నికి ఈ సగర కుమారులు ఆహుతి అవుతారు అని చెప్పాడు. దానితో దేవతలు, నాగులు ఇత్యాదులు తమ తమ స్వస్థలాలకు వెళ్లిపోయారు.

సగరుని పుత్రులు అలా తవ్వుతూ పాతాళం దాకా వెళ్ళి కపిల మహర్షి ఆశ్రమం చేరారు. అక్కడ యాజ్ఞాశ్వాన్నిచూసి ఆయనే అశ్వాన్ని దొంగిలించాడని ఆయన మీదకు కాలు దువ్వారు. మహర్షి కోపంతో చూసి తన శక్తితో వాళ్ళను భస్మీపటలం చేశాడు. అలా సగర కుమారులు 60000 మంది బూడిద కుప్పగా మారిపోయారు.



ఆ తర్వాత అంశుమంతుడు తాతగారి ఆదేశం మేరకు తన

**శ్రీమతి చక్రవర్తుల చూడామణి, ఖమ్మం**

పినతండ్రులను, యాగాశ్వాన్ని వెతుకుతూ బయలుదేరాడు. పినతండ్రులు తవ్విన మార్గంలో ప్రయాణం చేసి దారిలో కనపడిన దిగ్గజాలను చూసి, వాటిని భక్తితో పూజించి వినయంగా పినతండ్రుల జాడ అడిగాడు. ఆయన వినయ విధేయతలు దేశ కాల పరిస్థితులకు తగినట్లుగా మాట్లాడే తీరు, వినయంతో ప్రశ్నించే పద్ధతి చూసి ఆ దిగ్గజాలు సంతోషించాయి. అంశుమంతుని దీవించి ఆ దిగ్గజాలు ఆయనకు మార్గ నిర్దేశం చేసాయి. అక్కడ నుంచి అంశు మంతుడు పాతాళంలో కపిల మహర్షి ఆశ్రమానికి చేరుకున్నాడు. అక్కడ భస్మ రాశిగా పడి ఉన్న తన పినతండ్రులకు తర్పణం వదలాలని సంకల్పించి, నీళ్ళ కోసం వెతికాడు. ఎక్కడ నీళ్ళ జాడ కనపడ లేదు. సగర కుమారుల మేనమామ అయిన గరుత్మంతుడు వీళ్లకు సామాన్య పద్ధతులలో తర్పణం వదలడం వలన ప్రయోజనం లేదు. వీళ్ళు కపిల మహర్షి కోపాగ్నికి ఆహుతి అవడం వలన దుర్మరణం పొందారు.

'చండాలాదుదకాత్ సర్పాత్ వైద్యుదాత్ బ్రాహ్మణాదపి।
దంష్ట్రిభ్యశ్చ పశుభ్యశ్చ మరణం పాపకర్మణామ్॥
ఉదకం పిండదానంచ, ఏ తేభ్యో యద్విధీయతే।
నోపతిష్ఠతి తత్సర్వం అంతరిక్షే వినశ్యతి॥

చండాలుడు, జలము, సర్పము, పిడుగుపాటు, బ్రాహ్మణుడు, కోరలు గల జంతువులు, పశువులు,

# గంగావతరణ

మొదలైన వాటి వలన మరణించిన వారికి వదిలే తర్పణం, చేసిన పిండప్రదానం వాళ్ళకు చేరదు. వాళ్ళు ఆకాశంలోనే నశిస్తారు అని శాస్త్రం చెప్తుంది. సగర పుత్రులు పాపాత్ములు, బ్రాహ్మణుడైన కపిల మహర్షి వలన చనిపోయారు కాబట్టి వాళ్ళు తర్పణానికి అర్హులు కారు.

పవిత్రమైన గంగాజలం ఈ భస్మ రాశి మీద ప్రవహించడం వలన మాత్రమే వాళ్ళు ఉత్తమ గతిని పొందగలరు అని చెప్పాడు. అంశుమంతుడు గరుత్మంతుడి మాటలు పాలించి అశ్వాన్ని తీసుకొని తాతగారి దగ్గరకు వచ్చాడు. సగరుడు యజ్ఞాన్ని పూర్తి చేసాడు. సగర మహారాజు గంగను తీసుకువచ్చే విషయంలో నిర్ణయం తీసుకోకుండానే 30 వేల సంవత్సరాలు ఈ లోకంలో బతికి తనువు చాలించాడు. సగరుడి తర్వాత అంశుమంతుడు రాజ్యాన్ని పరిపాలించాడు. ఆయన తన కొడుకు దిలీపుడికి రాజ్యభారం అప్పజెప్పి గంగ కోసం హిమాలయాల దగ్గర తపస్సు చేయడం మొదలుపెట్టాడు 32 వేల సంవత్సరాలు తపస్సు చేసి గంగను భూలోకానికి తీసుకురాకుండానే స్వర్గస్తుడయ్యాడు. దిలీపుడు 30 వేల సంవత్సరాలు పరిపాలించి ఆయన కాలంలో కూడా గంగను తీసుకువచ్చే విషయంలో సరి అయిన నిర్ణయం తీసుకోకుండానే స్వర్గస్తుడయ్యాడు. ఆయన కుమారుడు భగీరథుడు. భగీరథుడికి సంతాన ప్రాప్తి కలగలేదు అందుకోసం పరితపించాడు. అప్పుడు పితృకార్యం నెరవేర్చడం కోసం గంగను దివి నుంచి తీసుకురావాలని హిమవత్పర్వత ప్రాంతాల్లో గోకర్ణానికి వెళ్లి అక్కడ బ్రహ్మ కోసం తీవ్రమైన తపస్సు చేశాడు. బ్రహ్మ భగీరథుడి తపస్సుకు మెచ్చి ప్రత్యక్షం అయ్యాడు. భగీరథుడు పితృదేవతలకు ఉత్తమ గతి కలిగించడం కోసం గంగను అనుగ్రహించమని, తన వంశాన్ని వృద్ధి చేయమని రెండు కోరికలు కోరాడు. బ్రహ్మ సంతోషంగా భగీరథుడికి రెండు వరాలు ఇచ్చాడు. గంగ దివి నుంచి భూలోకానికి వేగంగా దిగే సమయంలో ఆమె వేగానికి తట్టుకునే శక్తి పరమశివుడికి మాత్రమే ఉంది. అందు వలన ముందుగా పరమశివుడిని ప్రార్థించమని బ్రహ్మ చెప్పాడు. వెంటనే భగీరథుడు పరమశివుడి కోసం తపస్సు చేశాడు. (సశేషం )

# భరన్యాసము భగవంతుని పైనే భారము

(23 వ పేజీ తరువాయి) ఆనందముతో నాట్యమాడారట! అటు వంటి అభీష్ఠ వరదుడు స్వామి. "అర్థితార్థ పరిదాన దీక్షితుడు" వరదుడు. అందుకే వరదరాజ పెరుమాళ్ళను దేశికులు "అభీష్ఠ వరదా!" అని సంబోధిస్తున్నారు. పిరాట్టితో కూడిన పెరుమాళ్ పిరాట్టి పురుషకారముచేత, జీవాత్మ దోషములను చూడడు. పిరాట్టి పరమాత్మ యొక్క కరుణ, అనే గుణమును ప్రకాశించ జేయడముచేత, జీవాత్మ, పరమాత్మను శరణుకోరుతున్నాడు. అలా శరణాగతి చేసిన వాడిని, పరమాత్మ, క్షిపామి అంటూ మరల సంసార సాగరములో నెట్టివేయకుండా ధూమ్రాది మార్గములో అవస్థ పడకుండా, తన శరీరము నుండి విముక్తి పొందిన ఆత్మను తనంతట తాను, అర్చిరాది మార్గము గుండా తీసుకొని వెళ్ళమని ప్రార్థిస్తున్నారు. నీఅంతట నీవే నన్ను మోక్షానికి పిలుచుకొని వెళ్ళు అని అంటున్నారు. అర్చ్యారూపములో నున్న వరదుని కమల పదముల యందు శరణాగతి అనుష్ఠింప జేసి, వైకుంఠములో పరమపద నాథునిగా అమరిన తన తిరువడి తామరల వద్ద చేర్చుకోవాలని అంటూ ప్రార్థిస్తున్నారు. మొదటినుంచి న్యాసదశకములో ఎక్కడా నేను చేశానన్న మాట కానరాదు. భగవానే! నీ దయ చేత, నీవే నాచేత చేయించుకో, నీవే నాక్కు జ్ఞానమును ఇవ్వు. ఆ జ్ఞానముతో నీవే నన్ను శరణాగతి అనుష్ఠించేట్లు చేయి. నీవే నన్ను "మరణమానాల్" మరణము ఏర్పడినప్పుడు, అర్చిరాది మార్గములో తిరు మోగూర్ "వళుతుణై పెరుమాళ్" లాగా పిలుచుకొని వెళ్ళు నారాయణ! అభీష్ట వరదః అన్నారు.

ఎందుకనగా జీవాత్మకు అచిత్తైన శరీర సుఖము దాని పోషణ మీద విరక్తి ఏర్పడాలి. అప్పుడు అతనుచేసే కర్మలు సత్ కర్మలుగా వుంటాయి. అప్పుడే పరమాత్మకు జీవాత్మను తానే కాపాడాలన్న ప్రేమ ఏర్పడుతుంది. అప్పుడు "కరువిల్ తిరు" గర్భములో జీవాత్మ పడినా వానిమీద "జాయమాన కటాక్షము" కలుగుతుంది. దానివల్ల జీవాత్మలో సత్వగుణము వర్ధిల్లుతుంది. ఆ సత్వగుణమువలన అర్థపంచక జ్ఞానము ఏర్పడి, పరమాత్మను ప్రపత్తి చేయగలుగుతాడు. అలా ప్రపత్తి చేయడమువలన ఆత్మ స్వరూప లక్షణమును తెలుసుకొని, పరమాత్మయే శేషియని ఎరిగి ఆయనకు తాను దాసుడౌతాడు.

(సశేషం )

# అవయవ విభూతి

## దివ్యదేశ కైంకర్య భాగ్యం

**శ్రీమతి కొడకళ్ళ పద్మజ జ్యోతిర్మయి, చెన్నై.**



"పుండ్రం సేనాపతిం ప్రోక్తం" భగవద్రామానుజుల పుండ్రస్థానమందు విశ్వక్సేనులు వేంచేసి ఉంటారట! సకల ప్రపంచము విశ్వమును నిర్వహించు అధికారము శ్రీరంగనాధునిదే అయినా ఆ నిర్వహణ బాధ్యత విశ్వక్సేనులకు అప్పగించారట. సర్వేశ్వరుడు లక్ష్మీదేవితో కలిసి యథేచ్ఛగా లీలారసాన్ని అనుభవించడానికి వీలు కల్పిస్తారట. బ్రహ్మాండములోని సమస్త చరాచర జీవుల నిర్వహణ బాధ్యత విశ్వక్సేనులు అవలీలగా తన వేలిముద్రలతోనే నిర్వహింప సమర్థులు. "త్వయా నిస్సృశ్చాత్మ భవేద్యథా" అన్నారు కదా శ్రీ ఆళవందార్లు. విశ్వక్సేనులు ఎలాంటి వారంటే "త్వ హి యభుక్తోజ్ఝిత శేష భోజనా" పెరుమాళ్ళు భుజించి విడువగా మిగిలిన శేషాన్ని భుజించే వారట!

సేనా నాయకులు చూపుడువేలు చూపిస్తూ బెత్తం పట్టుకొని ఉంటారట "ద్వారే వసంతి వరనేత్ర హతోత్తమంగాః" అంటారు. శ్రీఅణ్ణంగరాచార్య స్వామి వారు. అలాంటి విశ్వక్సేనులవారు భగవద్రామానుజుల తిరుమణికాప్పు ధరించే స్థానంలో ఉంటారట!

పుండ్రం అంటే శరత్ కాలంలో అష్టమి తిథియందు ఉన్న చంద్రమండలంలో ఉన్న రెండు అమృతధారలు పరస్పరం అభిముఖులై ప్రవహించి దగ్గరకు చేరి కలిసి ఆ రెండింటి యొక్క మధ్యలో ద్వయముచే శోభితమై అందమైన లత వంటి నాసిక యొక్క మూలమును పూర్ణముగా గ్రహించి వెలుగుచున్నది. ఆ దివ్య ఉర్ధ్వ పుండ్రము. భగవత్ కైంకర్య సిద్ధికి మూలం ఈ విశ్వక్సేనులే అందువలన భగవద్రామానుజుల వారి పుండ్రాన్ని సేవిస్తే భగవత్ కైంకర్య సిద్ధి మనకు లభిస్తుందట! "ఈరారు తిరనామ మళంద వెళ్లిళ్ వాళి" అని కదా శ్రీ మనవాళమహామునులు ఈ ఊర్ధ్వ మండలానికి మంగళా శాసనం చేశారు.

"సూత్రం కూరపతిం తథా" బ్రహ్మసూత్ర స్థానంలో శ్రీకూరేషులు కూరత్తాళ్వాన్ వేంచేసి ఉంటారట! ఇవాళ మనకు రామానుజులు దక్కారు అంటే ఇద్దరే ఇద్దరు మహానుభావుల వలన. ఒకరు గోవిందులు,రెండు కూరత్తాళ్వాన్. ఆనాటి క్రిమికంఠుని దుష్కార్యా నికి తాము కాషాయాన్ని ధరించి రామానుజుల వారిని రక్షించారు. ఆచార్య రక్షకులు. అనగా ప్రమాతృ కైంకర్యం అన్నమాట! పరమత నిరసన. స్వమతస్థాపన చేసిన వారు. ఆనాడు నంబెరుమాళ్లను (శ్రీరంగం ఉత్సవ పెరుమాళ్లను) పిళ్ళలోకాచార్యస్వామి వారు రక్షించుకున్నట్లే ఆచార్య రక్షణ చేసిన వారు శ్రీకూరత్తాళ్వాన్. భగవద్భక్త రసార్ద్రహృదయులైన శ్రీకూరత్తాళ్వాన్ ద్వారా తిరువాయ్‌మొళిలోని రహస్యార్థాలను అనుభవించాలని భగవద్రామానుజులు సైతం ఆశపడ్డారు. ఏకసంతాగ్రాహులు వీరు. బ్రహ్మసూత్రాలకు భాష్యాన్ని రచించడానికి తోడ్పడిన కూరేషుల అసాధారణ మేధావిలాసం భగవద్రామానుజుల వారిని సైతం ఆశ్చర్యపరచేదట! ప్రమాణ కైంకర్యం అంటే శ్రీకోశాలను రక్షించుకోవడం అటువంటి బ్రహ్మ సూత్ర స్థానంలో ఉన్న కూరేశులను సేవిస్తే ప్రమాతృ కైంకర్యం ప్రమాణ కైంకర్యం లభిస్తాయి "ఇలన్గియ మున్నూళ్ వాళ్" వైదికోత్తములనే విషయాన్ని ప్రకాశింప చేసేదై, సంధ్యారాగ రంజితమైన మేఘంలో మెరుపుతీగ వ్యాపించి ఉన్నట్లు వక్షస్థలంలో ప్రకాశించే యజ్ఞోపవీతం నిత్య మంగళంగా ఉండాలి అని అంటున్నారు.

"భాగినేయం త్రిదండంచ కాషాయంచ ఆంధ్రపూర్ణకం
మాలాంచ కురుకేశార్యం ఛాయామ్ శ్రీ చాప కింకరం"

భాగినేయం త్రిదండంచ: శ్రీ వైష్ణవ యతులు మూడు వెదుళ్ళ దండాలను ఒకటిగా చేర్చి కట్టబడిన త్రిదండాన్ని

# దివ్యదేశ కైంకర్య భాగ్యం- అవయవ విభూతి

చేతిలో ధరించి ఉంటారు. ఈ త్రిదండం విష్ణు రూపంగా స్తుతింపబడుతుంది. చిత్ అచిత్ ఈశ్వర తత్వత్రయానికి సంకేతం అన్నమాట! "వేదాంత సార సుఖ దర్శన దీప దండాః" అన్నట్టుగా రామానుజుల వారి త్రిదండం మదించే కవ్వం వంటిదై దివిటీ వలె వేదాంతంలోని సారాన్ని సుఖంగా దర్శింప చేయడంలో దివిటీ వలె ప్రకాశిస్తోందట! ఆ త్రిదండ స్థానంలో శ్రీ మొదలియాండాన్ అనబడే దాశరథి అనే ఆచార్యులు వేంచేసి ఉంటారట! వీరే రామానుజుల వారికి పాదుకా స్థానీయులు. "అహమస్యా పరో భ్రాతా గుణైర్దాస్య ముపాగతః" అని నేను శ్రీరామునికి అనుజుడను, ఆయన గుణములకు దాసుడను అని లక్ష్మణస్వామి అన్నట్లుగా ఈ మొదలియాన్డాన్ రామానుజుల వారికి అత్యంత పవిత్రమైన పాదుకా స్థానీయులుగా గౌరవింప దగ్గ ఆయా స్థానాలు స్వీకరించారు. పూర్వాశ్రమంలో రామానుజుల వారి మేనల్లుడు. భగవద్రామానుజులవారు సన్యసించినప్పుడు ఈ మొదలియాండాన్ సంబంధాన్ని తప్ప అన్ని దేహ బంధాలను త్యజించేరట!

శ్రీరంగనాథుడు భగవద్రామానుజుల వారిని "విశిష్టాద్వైత సిద్ధాంతమే పరమ వైదికమైన సిద్ధాంతమని నాలుగు దిక్కుల నిరూపించి విజయ స్తంభాలను నాటిరండి!" అని ఆజ్ఞ ఇచ్చినప్పుడు మొదలియాండాన్‌కే శ్రీరంగాలయ అధికారాలను అనుగ్రహించారట! "శ్రీమన్ శ్రీరంగ శ్రియం అనుపద్రవాం అనుదినం సంవర్ధయ" అన్న వాక్యాన్ని సార్థకం చేసినట్టు రోజుకు రోజుకు వృద్ధిపరిచారు. అందువలన రామానుజుల వారి త్రిదండాన్ని సేవిస్తే మనకు కూడా దివ్యదేశకైంకర్యం చేసే భాగ్యం లభిస్తుందట! "తిన్నరంగల్ శెల్వ ముత్తం తిరుత్తినైలూన్ వాళియే" శ్రీరంగ క్షేత్రంలోని సంపదను అంతటినీ సంస్కరించి అభివృద్ధి చేసిన వారు వర్థిల్లాలి.


కాషాయంచ ఆంధ్రపూర్ణకం: శ్రీ మణవాలమామునులు ఆర్తి ప్రబంధంలో అనుగ్రహిస్తారు. "యతిరాశా ఆచార్యా అభిమానమే ఉత్తారకం" అని తదేకమైన నిష్ఠ కలిగిన వడగనంబియొక్క చరమ పర్వనిష్ఠను మాకు అనుగ్రహించ వలసినది" అని స్తుతించబడినది. (సశేషం )

# పుస్తక పరిచయం

**"శ్రీ పాంచరాత్ర, పరిచయము,"**

పరమ వైదికాగమమగు పాంచరాత్రాగమము మహోత్కృష్టమైనది. "నారాయణ ముఖోద్గీతం" అని సాక్షాత్ భగవంతునిచే చెప్పబడింది. అట్టి పాంచరాత్రాగమంపైన ఎన్నో వాఖ్యాన గ్రంథాలు వచ్చినవి. శ్రీమాన్ డా.రేజేటి వేంకట వేణుగోపాలాచార్యులు కొంతమూరు, రాజమండ్రి వాస్తవ్యులు, (ఆంధ్రప్రదేశ్ పాంచారాత్రాగామ సలహామండలిలో సభ్యులు)

"శ్రీ పాంచరాత్ర, పరిచయము " గ్రంథాన్ని రచించారు. పాంచరాత్రాగమంపై పరిశోధనలు జరిపి, అనేక ప్రాచీన తాళపత్రాలను శ్రమ కోర్చి సేకరించారు. పండితుల రచనలు, శాస్త్ర ప్రమాణములతో పాంచరాత్రాగమ విశేషములపై ఎన్నోగ్రంథాలు వీరు వెలయించారు.







పాంచరాత్రాగమ విశేషాలను సమగ్రంగా తెలియచేసే గ్రంథం "శ్రీపాంచరాత్ర పరిచయం". '380' పేజీలతో, శ్రీశ్రియః పతుల ముఖచిత్రంతో ఎంతో ఆకర్షణీయంగా ఉంది. వెనుక పుటపై ప్రముఖుల అభిప్రాయములు ముద్రించబడినవి. శ్రీమాన్ రేజేటి రంగాచార్యుల శత జయంతి ప్రచురణలుగా ముద్రితమైనది. పీఠాధిపతుల, ఆచార్యపురుషుల పండితుల ముందుమాటలతో జ్ఞాన దాయకంగా ఉంది. పీఠికలో రచయిత అభిప్రాయముగా గ్రంథ విశేషాలు వారి అనుభవాలు ముద్రించబడ్డాయి. గ్రంథంలో పాంచరాత్ర స్థితిగతులు సంహితల విశేషాలు తెలుపబడ్డాయి. రచయిత డాక్టర్ శ్రీమాన్ రేజేటి వేంకటవేణుగోపాలచార్యులు. పుస్తకము లభించు ఫోన్ నెంబర్ 9346360891

# ఉభయ వేదాన్త ఐక కంఠ్యము


## వేదమనైత్తుక్కుమ్ విత్తాగుమ్

శ్రియ:పతి శ్రీమన్నారాయణుడే ఉపాయము, ఆయనే పరము ప్రాప్యము అని విశిష్టాద్వైత సిద్ధాంతము. ఆయన ప్రకృష్టమైన భక్తి, ప్రపత్తులకే సాధ్యుడు అని "దర్శన స్థాపనోత్సుకం తుండీర మండలే శేష మూర్తిం రామానుజం భజే" అని మనం ఎవరినైతే దర్శన స్థాపకుడని నిత్యం కొనియాడుతున్నామో ఆ రామానుజులు మనకనుగ్రహించిన సిద్ధాంతాన్ని 'రామానుజార్య దివ్యాజ్ఞామ్ వర్ధతామ్ అభి వర్ధతామ్' గా మనం అనుసరించి తీరాలి.

మనం భక్తి ప్రపత్తులను ఉపాయాలుగా స్వీకరిస్తున్నాం. ప్రమాణమేమిటి? అంటే కఠోపనిషద్ వాక్యమే ప్రమాణం. "అన్యత్ర ధర్మాదన్యత్రాధర్మాత్' అను ప్రమాణానుసారం భక్తి, ప్రపత్తులను విలక్షణములైన, ప్రసిద్ధములైన ఉపాయాలుగా స్వీకరిస్తున్నాం. మనకు ఉభయ వేదాంతములున్నాయి. ఒకటి సంస్కృత వేదాంతము, రెండవది ద్రావిడ వేదాంతము అని. ఈ వేదాంతములు ఒక్కొక్కటి ఒక్కొక్క ఉపాయాన్ని మనకు అనుగ్రహిస్తున్నాయి. దీనికి మూలం ఆళ్వారుల ఆచార్యుల దివ్య మంగళ విగ్రహ స్వరూపం. ఆ జ్ఞానమూర్తులను దర్శిస్తే మనకు తెలుస్తుంది. స్వామి ఎమ్బెరుమానార్లు అంజలి ముద్రతో దర్శనమిస్తారు. అంజలి అనునది భక్తికి సూచకము. ఎలా?

"అంజలి: ప్రథమా ముద్రా క్షిప్రం దేవ ప్రసాదినీ" అని కదా! అందుకు రామానుజులు భక్తికి గుర్తు ఐన నమస్కార ముద్రను సూచిస్తూ భక్తిని ముక్తికి సాధనంగా మనకు చెప్పకనే చెపుతున్నారు. అంజలి అనునది ఒకప్పుడు ధ్యానముద్రగా కూడా చెప్పబడింది. 'ప్రీతి పూర్వక మనుధ్యానం భక్తిరిత్యభిధీయతే", కనుక అలా చెప్పబడిన భక్తి ఎలా ఉండాలి? అంటే "తైల ధారవత్ అవిచ్ఛిన్న స్మృతి సంతాన రూప దర్శన సమానాకార భక్తి". అయి ఉండాలి. ఆ రూపంగానే స్వామి రామానుజులు దర్శనమిస్తారు. అంజలి అనునది పూర్ణ భక్తికి సూచకం. అదియే ముక్తికి సులువైన మార్గము. అని తమ దివ్యమంగళ విగ్రహాన్ని దర్శింప చేసి అనుగ్రహించిన ఆచార్యులు రామానుజులు.

మరి ప్రపత్తిని, దాని వైభవాన్ని మనకు అందించడానికేనేమో అన్నట్లు శ్రీమన్నమ్మాళ్వార్లు తమ దివ్య మంగళ విగ్రహాన్ని జ్ఞాన ముద్రతో మనకు దర్శింప చేశారు. ప్రపత్తికి ముఖ్య అంగము ఆత్మ నిక్షేపము. ఆ ఆత్మ నిక్షేపాన్ని తెలియచేస్తూ, అందుకు మూలమైన ప్రపత్తియే



**శ్రీమాన్ శ్రీ అప్పన్‌కందాడై శ్రీనివాసాచార్యులు**

ముక్తికి ముఖ్య సాధనమని ఆ జ్ఞాన ముద్రితమైన శ్రీహస్తము సూచిస్తున్నది. రెండు చేతుల కలయిక అంజలి ముద్ర అన్నారు కదా! మరి

జ్ఞానముద్ర అంటే ఏమిటి? వివరణలోకి వస్తే, మన శరీరం పంచభూతాత్మకమైనది. ఈ ప్రకృతి త్రిగుణాత్మకమైనది కదా! మన చేతికి వున్న ఐదు వ్రేళ్ళలో అన్నిటికన్నా చిన్నదైన చిటికెన వేలు నుండి వరుసగా మూడు వ్రేళ్ళు, ఈ ప్రకృతిలోని సత్వ, రజ, స్తమోగుణాత్మకమైన మూల ప్రకృతిని సూచిస్తాయి. చూపుడు వేలు మూడు తత్వములలోని జీవ తత్వమునకు, అంగుష్టము (బొటనవేలు) పరతత్వము (పరమాత్మ తత్వము) నకు గుర్తుగా తీసుకుంటే, ఈ జీవుడు ప్రకృతిని విడిచి పరమాత్మను చేరుటకు శరణాగతి చేయడము. అంటే! జీవ తత్వమునకు చిహ్నమైన చూపుడు వేలును మరియు పరమాత్మ తత్వమునకు చిహ్నమైన అంగుష్ఠముతో కలుపుట. అంటే జీవుడు పరమాత్మ నాశ్రయించి శరణాగతి చేయుట, దానిని సూచించునది జ్ఞానముద్ర. ఇది శరణాగతి.

ఈ రెండు వేదాంతములు కూడా వేరు వేరు మార్గముల ద్వారా కాక కర్మ జ్ఞాన యోగముల వలె "ఏక మప్యాస్థిత స్సమ్యక్ ఉభయోః విన్దతే ఫలమ్" అని చెప్పినట్లు ఈ రెండు విషయాలు కూడా ఒకే పురుషార్ధము కొరకు ఏర్పడినవే.

# ఉభయ వేదాన్త ఐక కంఠ్యము

"వేదమనైత్తుక్కుమ్ విత్తాగుమ్" అని గోదమ్మ కూడా అనుగ్రహించిన విషయం తెలుసు కదా! కనుక "భక్తిని" బోధించు సంస్కృత వేదాంతము, "ప్రపత్తిని" తెలియచేయు ద్రావిడ వేదాంతము ఒకే విషయాన్ని నిర్ధారించుటకు బోధింపబడిన రెండు (మార్గములు) సాధనములు. సంస్కృత వేదాంతమంటే? శ్రీభాష్యాది గ్రంథ సముదాయము. ఆచార్య బోధితములు. ద్రవిడ వేదాంతమంటే? ఆళ్వారులను గ్రహించిన భగవద్విషయాది గ్రంథములు. భగవదారాధనా రూపంగా (కర్మ భక్తి యోగ) మనకు భక్తి తత్వాన్ని అందించేవి శ్రీభాష్యాది గ్రంథమాల, అలాగే పరమాత్మ యొక్క స్వరూప రూప గుణ విభూత్యైశ్వర్యములను ఆరావముదముగా, ప్రపత్తిని, దీర్ఘ శరణాగతి రూపంగా అందించునవి భగవద్విషయాది గ్రంథములు. ఈ సంస్కృత, ద్రావిడ ప్రబంధములు, పరమాత్మ యొక్క పరత్వ మరియు పరతత్వ వైభవమును ప్రమాణ పూర్వకంగా వివరించడం చేత పూర్వాచార్యులు ఈ ఐక్య నిర్ణయమును అంగీకరించి యున్నారు.

ఒకసారి శ్రీపరాశరభట్టారకులు అనుగ్రహించిన తిరువాయి మొళి తనియన్లు చూస్తే "వాన్ తిగజుమ శోలై అనే తనియన్లో 'ఇన్నముద్దలాయ్ శడగోపన్ మొయ్ మ్బాల్ వళర్త ఇదత్తా ఇరామానుశన్" అని ఆళ్వారుల, ఆచార్యుల స్థానాల్ని వ్యక్త పరిచారు. ఈ దివ్య ప్రబంధమునకు కన్న తల్లి "నమ్మాళ్వార్" అయితే దానిని తన రచనా వైదుష్యము చేత పెంచి పోషించిన తల్లి (హితురాలు) భగవద్రామానుజులు, అని తమ తనియన్లో భట్టారకులు సాయించినారు. పరమాత్మ తత్వమును పెంచుట పోషించుట అంటే? భగవద్విషయ ప్రతిపాదితార్థములకు ప్రతికూలంగా వాదించు ఇతర మతములవారిని నిరసించి, వాటిని సరియైన ప్రమాణాలతో సమర్థించి స్వమతాన్ని పటిష్ఠ పరిచారు భగవద్రామానుజులు తమ శ్రీభాష్యాది గ్రంథాలలో. "పురా సూత్రై ర్వ్యాసః శృతి శతశిరోర్థం గ్రథితవాన్" పూర్వం శ్రీ వ్యాసమహర్షి బ్రహ్మ సూత్రాలను రచించి ఉపనిషదర్థాలను పొల్లు పోకుండా "సూత్రాక్షరాణి వ్యాఖ్యాస్యంతే" సూత్రములను అక్షరములను కూడా వ్యాఖ్యానం చేశారు. "వివవ్రే తమ్ శ్రావ్యం వకుళ ధర తామేత్య స పునః" ఆ తర్వాతి కాలంలో ఆ వ్యాసభగవానుడే ఆళ్వారులుగా అవతరించి జీవులపైని అవ్యాజమైన వాత్సల్యముతో "శవిక్కినియ శంజోల్" అన్నట్లు అతృప్తామృతంగా తిరువాయ్ మొజి ప్రబంధాన్ని అనుగ్రహించారు. వ్యాఖ్యానించారు కూడా. "ఉభౌ ఏత! గ్రంథౌ ఘటయితుమలం సూక్తిభి రసౌ" తిరిగి ఆ వ్యాస మహర్షియే 'పునర్జజ్ఞే రామావరజ ఇతి స బ్రహ్మముకురః' ఈ బ్రహ్మ సూత్రములు, మరియు తిరువాయిమొజి దివ్య ప్రబంధము అను ఈ రెంటిని సమైక్య పరచుటకు మరల రామానుజులుగా అవతరించారని 'ఆచ్చాన్ పిళ్ళై" అనువారు శ్లోక రూపంగా అనుగ్రహించారు. మనకు వేదాంతదేశికులు "ద్రవిడోపనిషత్ తాత్పర్య రత్నావళి" అనుదానిని అనుగ్రహించి అందులో ఒక శ్లోకంలో,

శ్లో॥ ఆదౌ శారీరకార్థ క్రమమిహ విశదం వింశతి ర్వ్యక్తి సాగ్రా।
సంక్షేపోసౌ విభాగం ప్రథయతి చ ఋచాం చారుపాఠోపపన్నమ్।
సమ్యగ్గీతానుబద్ధం సకలమనుగతం సామ శాఖాసహస్రమ్।
సంలక్ష్యం సాభిధేయైర్యజురపి దశకై ర్బాత్యథర్వా రసైశ్చ॥

తాత్పర్యము: తిరువాయ్ మొజి దివ్య ప్రబంధంలోని మొదటి రెండు దశకాలలోని 21 పాశురాలచేత ఉపనిషదర్థములు, ఇరవై ఒక్క శాఖలుగా చెప్పబడిన ఋగ్వేద శాఖలుగా గోచరిస్తున్నాయి. ప్రబంధంలోని వేయిపాశురాలచేత గానంతో కూడిన వేయి సామవేద శాఖలు, దశకాలచేత ఒక నూరు శాఖలుగల యజుర్వేదము, శాంతి రస ప్రధానమైన ఈ ప్రబంధంలో అష్ట రసాలున్నందువల్ల అష్ట శాఖలుగల అధర్వణ వేదం భాసిస్తున్నది. కనుక వేద సదృశమైన ప్రబంధం తిరువాయ్ మొజి దివ్యప్రబంధం. తిరువాయ్ మొజి వేదోప బృంహణము మాత్రమే కాదు వేద సదృశమైనది.

పై శ్లోక ఆంతర్యాన్ని చెప్తూ, బ్రహ్మసూత్రములు నాల్గు అధ్యాయములు పదహారు పాదములుగా రచించి అందులో ప్రతిపాదింపబడిన అర్థ సారమంతా తిరువాయ్ మొజి దివ్యప్రబంధంలోని మొదటి శతకంలోని మొదటి రెండు దశకములలో విశదంగా వివరించారు అని ఈ శ్లోక తాత్పర్యము.


# సంభాషణా చాతుర్యం

సంస్కృత సాహిత్యంలో పంపా సరోవర వర్ణనంలో అత్యద్భుతమైన వర్ణనా నైపుణ్యం గోచరిస్తుంది. శ్రీ రామాయణం ఆధ్యాత్మిక పరంగానే కాక సంస్కృత భాషలో గల సాహిత్య పరమైన శబ్దార్థ గాంభీర్యాలను వివరిస్తూ తరువాతి కవులందరికీ మార్గదర్శనం చేయడంతో వాల్మీకికి ఆది కవి అని ప్రసిద్ధి వచ్చింది. తరువాతి కవులకు మార్గదర్శనం చేసిన వానిగా “మధురస భణితీనాం మార్గదర్శీ మహర్షిః” అని చంపూరామాయణంలో భోజ రాజు వాల్మీకి మహర్షిని శ్లాఘించాడు.

సరోవరం వర్ణన తరువాత రామలక్ష్మణులను దూరం నుంచి చూసిన సుగ్రీవుడు వారిని వాలియొక్క గూఢచారులుగా భావించాడు. ఒక భయశంకను తీర్చుకోవటం కోసం హనుమను పంపిస్తాడు. హనుమతో రామ లక్ష్మణుల సంభాషణ జరుగుతుంది. ఆచార్య లక్షణములు పరిపూర్ణంగా కలిగి ఉన్న హనుమ రాముని సాక్షాత్ శ్రీమన్నారాయణ స్వరూపంగా గుర్తించడం, అదే విధంగా రాముడు హనుమను జీవాత్మ పరమాత్మలను కలిపే ఘటకునిగా భావించడం జరుగుతుంది. “భూషణార్హావిమౌ బాహూ” అంటూ ద్వివచనం రాముడు ఒక్కడికే కాక లక్ష్మణునికి కూడా వాడి నట్టు అన్వయం చేస్తే ఇద్దరినీ అంతకు ముందు చేసిన వర్ణనను కలిపి చూస్తే నాలుగు కలిపి బాహవః అని బహువచనం (బాహవః అని పాఠాంతరం) ప్రకారం చతుర్భుజాలతో శోభించే నారాయణునిగా తెలిపినట్టు అయింది. హనుమ వేదాధ్యయనం ఇత్యాదులు వలన “ఆచార్యో వేద సంపన్న”. అని, “ఉద్యతాసేరరేరపి” అనినందున హనుమ సంభాషణ చాతుర్యం కార్య నిర్వహణకి వీలైన దిగా రాముని చే గుర్తింపు పొందినట్లైంది.



హనుమ సంభాషణ సుగ్రీవుని పరంగా జరిగితే అందుకు అనుగుణంగా లక్ష్మణుడు రాముని పరంగా సంభాషణ చేశాడు. సుగ్రీవుడు చింత చచ్చినా పులుపు చావని రీతిలో తాను వానర రాజు కాకపోయినా ఒక వానర ప్రముఖుడుగా రాముని చేత ఆశ్రయించబడిన వానిగా భావించుకుంటూ లక్ష్మణునితో తనకు అవసరమేమి లేదు కదా అనుకుంటూ ఉపేక్ష వహిస్తాడు. కానీ హనుమే లక్ష్మణునితో గౌరవంగా సంభాషిస్తాడు.




**శ్రీమాన్ శ్రీ శ్రీభాష్యం జగన్నాథాచార్యులు**

హనుమ సంభాషణా చాతుర్యం గురించి మరికొంత....

ఋగ్వేదం శబ్ద ప్రధానం. చెప్పేమాటలో అప శబ్దం కాని అస్పష్టత కాని ఉండరాదు. ఇక యజుర్వేదం ధారణా ప్రధాన క్రమంగా ఉండాలి. చెబుతూ చెబుతున్నదానిని వదలకుండా కొత్త విషయం చెబుతున్నప్పుడు జోడించుకుంటూ చెప్పాలి. మనవాళ్ళు జడ అల్లుకునే విధంగా మాటలు పేనుకుంటూ అంతవరకూ చెప్పినది ఇక ముందు చెప్పబోయేది ఒకదానికొకటి కలిసి ఉండే విధంగా మాటాడుతారు. దాన్ని మనం క్రమాంత స్వాధ్యాయి జటాంత స్వాధ్యాయి అంటూ ఉంటాం వేదపండితులను. ఇక సామవేదం ఇది గాన ప్రధానం. అన్ని వేదాలు పరమాత్మనే తెలిపి, పరమ పదం చేరిన ముక్త జీవుడు పరమాత్మతో తనకు కల సంబంధం గురించి చెప్పే విషయం అంతా సామవేద పరంగా ఉంటుందని చెప్తారు. మన నమ్మాళ్వార్లు అనుగ్రహించిన తిరువాయ్ మొఝిని కూడా సామవేద సారంగానే మనం భావిస్తాం! ఆవిధంగా హనుమతో సంభాషిస్తున్నప్పుడు రాముడు వేదవేత్తగా భావిస్తాడు. భవిష్యత్తులో సీతమ్మను వెతకటం, ఆమెతో సంభాషించడం తన గురించి తెలియ చేయడంలో హనుమ తనకు పనికి వచ్చే సమర్థుడైన ఘటకునిగా (మిగతా 34 వ పేజీలో)

# శ్రీరంగ క్షేత్ర ఉత్సవం ఫల్గుని ఉత్తరం



సమాచార సేకరణ: **శ్రీమాన్ శ్రీ గోమడం శడగోపన్ స్వామి శ్రీరంగం**





ఫాల్గుణ పౌర్ణమి నాడు హోలీ పండుగ వసంతోత్సవమే కాకుండా పలు వైష్ణవ దేవాలయాల్లో లక్ష్మీ జయంతిని కూడా వైభవంగా నిర్వహిస్తారు. ఉత్తర ఫల్గుణి నక్షత్ర యుక్తమైన పూర్ణిమ రోజున క్షీర సాగరం నుండి మహాలక్ష్మీ దేవి ఉద్భవించినట్లుగా పురాణ కథ. ఆ విశేషాన్ని పురస్కరించుకొని ప్రముఖ దివ్యదేశం. శ్రీ వైష్ణవ దివ్య దేశాల్లో మూలస్థానంగా భావించే శ్రీరంగమందు శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో "ఫల్గుని ఉత్తరం" అని గొప్ప ఉత్సవాన్ని జరుపుతారు. సంవత్సరాంతం వరకు జరుపబడే ఉత్సవాల్లో ఆది బ్రహ్మోత్సవంగా చెప్పబడే "ఫల్గుని ఉత్తరం" ఉత్సవం విశేషమైనది. నాటకీయ పరిణామాలతో వాదోపవాదాలుగా జరిగే "ప్రణయ కళగం" ఉత్సవం కన్నుల పండుగగా నిర్వహిస్తారు. సమీపంలో గల ఉరయూరు దివ్యదేశంలోని అమ్మవారు కమలవల్లి తాయారుతో శ్రీరంగ మందలి ఉత్సవ పెరమాండ్లు నంబెరుమాళ్లతో దర్శనంగావిస్తారు. పదకొండు రోజులు జరిగే ఈ ఉత్సవంలో శ్రీరంగనాచ్చియార్ నంబెరుమాళ్లకు తిరుమంజనం పవిత్రోత్సవాలు జరిపిస్తారు. జీవాత్మ పరమాత్మ కలయికకు ప్రతీకగా అమ్మవారిని స్వామిని ఒకే శేర్తిపై వేంచేపు చేస్తారు. అమ్మవారు స్వామి మధ్యన కలహాన్ని తీర్చే నెపంతో నమ్మాళ్వార్ల మూర్తిని కూడా వేంచేపు చేస్తారు. తాయారుచేత "మత్తై ఆడి" అని వెన్న ముద్దలను విసురుతూ అర్చకముఖంగా విన్నపాలు వినిపిస్తూ అమ్మవారికి ఉంగరాన్ని సమర్పిస్తూ ఉత్సవాన్ని జరుపుతారు. విశేషించి పూర్వం "ఫల్గుని ఉత్తరం" ఉత్సవం రోజు ఏకపీఠంపై కూర్చున్న శ్రీరంగనాథ తాయారులను ఉద్దేశించి భగవత్ రామానుజాచార్యులు లోకులందరినీ ఉద్ధరించడానికి అందరి పక్షంగా శరణాగతి గద్యను, శ్రీరంగ గద్యను, వైకుంఠ గద్యను విన్నవించిన శుభదినం ఈరోజు. ఆ విశేషాన్ని గుర్తుచేస్తూ విశేషమైన దివ్య ప్రబంధ పాశురాలను, గద్యత్రయాన్ని విన్నవిస్తారు. అద్భుతంగా భక్తి పరవశంతో జరిగే ఈ ఉత్సవాన్ని దర్శించుకోవడానికి వేల మంది భక్తులు తమిళనాడులోని శ్రీరంగ క్షేత్రానికి వస్తారు. క్షీరసాగరోద్భవి లక్ష్మీదేవి జన్మించిన రోజుగా భగవంతునిచే స్వీకరింపబడిన రోజుగా అమ్మవారి దర్శనం ఈరోజు మరింత విశేషంగా, పుణ్యప్రదమైనదిగా భావిస్తారు. ★

## సత్సంప్రదాయ పరిరక్షణ సభ

(17వ పేజీ తరువాయి) 1)ఉపనిషత్ సంప్రదాయ పరిరక్షణకు కృషి సలుపుట. 2) పూర్వాచార్యుల వ్యాఖ్యాన గ్రంథాలను సేకరించి పునర్ముద్రింప చేయుట. 3) సాంప్రదాయ గ్రంథాలను ప్రాంతీయ భాషలోనికి అనువదించుట. 4) శ్రీ రామానుజ సిద్ధాంతముపై దుర్విమర్శలను ఖండించి గ్రంథ రూపంలో సమాధానములు ఇచ్చుట. 5) విద్వాంసులకు ప్రోత్సాహకరంగా గౌరవ పురస్కారాలను సమర్పించుట ఇత్యాది.

శ్రీమాన్ శ్రీ నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్య స్వామి వారు స్వయంగా ఒక గ్రంథ పీఠికలో ఇలా సందేశాన్నిచ్చారు "ఒకసారి కొద్ది సమయమిచ్చి ఓపికతో మా గ్రంథములను చదవండి!. మన సంప్రదాయములోని ఆశ్చర్యకరమైన విషయములను, సదుపదేశములను, మధుర సందర్భములను రుచి చూడండి!. అవశ్యము మీలో సంప్రదాయ శ్రద్ధ ఏర్పడి మంచి మార్పురాగలదని మా ప్రగాఢ విశ్వాసము". ★

# శ్రీరామనవమి ఉత్సవాలకు భద్రాచలం ముస్తాబు








శ్రీరామనవమి ఉత్సవాలకు భద్రాచలం ముస్తాబయింది. శ్రీ సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నెలరోజుల ముందు గానే రాములవారి తలంబ్రాలను సిద్ధం చేసే ప్రక్రియ సంప్రదాయబద్ధంగా మార్చి 26న భద్రాచలంలో నిర్వహించారు. అంతకు ముందు వివిధ గ్రామాలలో గోటితో వొలిచి తీసుకువచ్చిన తలంబ్రాలను శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో భక్తులు సమర్పించారు.

ఏప్రిల్ 17న భద్రాచలంలో సీతారాముల కల్యాణం, 18న మహా పట్టాభిషేక వేడుకలకు హాజరయ్యే భక్తుల కోసం ఆన్ లైన్ లో టికెట్లు జారీ చేస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎల్. రమాదేవి ఒక ప్రకటనలో తెలిజేశారు. సీతారాముల కల్యాణం, మహా పట్టాభిషేక వేడుకల్లో పాల్గొనే భక్తులకు మార్చి 25 నుంచి ఆన్ లైన్‌లో టికెట్లు అందుబాటులో ఉంచుతున్నట్లు వారు తెలిపారు.

## శ్రీసన్నిధి పదకేళి (1) సమాధానాలు

విజేతలకు ఏప్రిల్ నెల పత్రిక పంపించడం జరుగుతుంది

నిలువు

1. అర్జునుడు 2. అమావాస్య 4. అరుంధతి
5. శిశిరఋతువు 3. హనుమంతుడు

అడ్డం

5. శిలాఫలకం 10. త్రిశూలం 6. హోళీ
7. కన్య 8. సూర్య 11. విభీషణుడు
12. ధృతరాష్ట్రుడు 13. బ్రహ్మ 9. దుర్గ

సరియైన సమాధానాలు పంపినవారు:

వై.శివప్రసాద్, బోయవాడ, కరీంనగర్
పి . పద్మావతి, చైతన్యపురి, కరీంనగర్
సిహెచ్. పద్మ, మేడిపల్లి, హైదరాబాద్
జి. సువర్ణ, సిరిసిల్ల,
టి. లక్ష్మీ రాణి, శ్రీకాకుళం
వి. ఉదయశంకర్, బెంగళూరు,
సిద్ధుల మహేష్, వరంగల్
కె. నారాయణ రావు, హైదరాబాద్
డా. జి రాందాస్ విజయవాడ, ఎన్ వేణు, వైజాగ్
లలితశ్రీ యం, మౌలాలి, హైదరాబాద్
యస్. వివేకానంద, విద్యానగర్, కరీంనగర్



# స్వయంభువు
# స్తంభలక్ష్మీనరసింహస్వామి




## వెలిచాల స్తంభ లక్ష్మీనరసింహస్వామి

శ్రీస్తంభ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెలిచాల గ్రామంలో దాదాపుగా ఎనిమిది వందల సంవత్సరాల క్రితం కాకతీయుల కాలంలో నిర్మించినారు. ఈ ఆలయం మొత్తం కూడా రాతితో నిర్మితమైనటువంటి ఆలయం ఈ ఆలయంలో స్వామి స్తంభంలో స్వయంభువుగ ఉద్భవించడం వల్ల ఈ ఆలయానికి స్తంభ నారసింహస్వామి దేవాలయం అని పేరు పెట్టారు. సహజంగా స్తంభ నారసింహస్వామి ఎప్పుడూ కూడా ఉగ్రరూపంలో ఉంటాడు. కాలక్రమంలో స్వామి యొక్క ఉగ్రాన్ని తట్టుకోవడానికి ఆలయ ముఖ ద్వారం వద్ద లక్ష్మీ అమ్మవారి యొక్క స్తంభాన్ని ప్రతిష్ఠింపజేసి ఈ దేవాలయాన్ని స్తంభలక్ష్మీ నరసింహస్వామిగా మనుగడలోకి తీసుకు రావడం జరిగింది. కాలక్రమంలో ఈ ఆలయం ఆదరణకు నోచుకోకపోవడం వల్ల కొంత శిథిలావస్థకు చేరుకున్న తరుణంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్





స్వామి వారి మంగళా శాసనములతో వెలిచాల వాస్తవ్యులు వీర్ల ప్రభాకర్ రావు సరోజన దంపతులు ఈ ఆలయమును పునరుద్ధరింప చేశారు. ఈ ఆలయంలో ఏడు సంవత్సరాల క్రితం శ్రీశ్రీశ్రీ చినజీయర్ స్వామివారి శ్రీహస్తములచే కళ్యాణమంటపం యజ్ఞశాల మరియు తదియారాధన (భోజనశాల) మండపం ఏర్పాటు చేశారు. మరియు వీర్ల ప్రభాకర్ రావు గారు తమ యొక్క సొంత ఖర్చులతో దేవాలయముకు సోలార్ సిస్టం ఏర్పాటు చేయడం జరిగింది. వచ్చే భక్తుల సౌకర్యార్థం 2023లో దాతల సహాయంతో నూతనంగా శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ధర్మశాలలు ఏర్పాటు చేయడం జరిగింది (సహాయము చేసిన దాతలు పొన్నం చంద్ర ప్రకాష్ గౌడ్ రేగూరి రవీందర్ పూదరి తిరుపతి వీర్ల ప్రభాకర్ రావు సరోజనమ్మ) ఈ ఆలయంలో పూర్వము నుండి

# స్వయంభువు స్తంభ లక్ష్మీనరసింహస్వామి



వంశపారపర్యంగా సౌమిత్రి వంశస్థులు ఆలయ అర్చకులుగా కొనసాగుతున్నారు ప్రధాన అర్చకులుగా సౌమిత్రి నరసింహాచార్యులు సౌమిత్రి రంగాచార్యులు ప్రస్తుతం సౌమిత్రి నారదాచార్యులు సౌమిత్రి రామానుజాచార్యులు ఆలయ అర్చకులుగా కొనసాగుతున్నారు. ఈ ఆలయంలో ప్రతి సంవత్సరం ఉగాది పంచాంగ శ్రవణం మొదలుకొని శ్రీరామనవమి, నరసింహ జయంతి,దసరా నవరాత్రోత్సవాలు కార్తీకదీపోత్సవం ధనుర్మాస, గోదా కళ్యాణం ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు జరుగుతాయి. లక్ష్మీ నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఫాల్గుణ శుద్ధ ఏకాదశి మొదలుకొని పౌర్ణమి, (హోలీ పండుగ వరకు శ్రీ శ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామివారి మంగళ శాసనాలతో జరుపబడతాయి. ఈ ఆలయంలో విశేషంగా ఐదు సంవత్సరముల నుండి ప్రతిరోజు నిత్య కళ్యాణం జరుగుతుంది. ఈ ఆలయమును దర్శించండి తరించండి సర్వేజనా సుఖినోభవంతు


(ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ, ఆలయ చైర్మన్ వీర్ల ప్రభాకర్ రావు గారు సరోజనమ్మ మరియు గ్రామ ప్రజలు వెలిచాల.)

# సంభాషణా చాతుర్యం

(30 వ పేజీ తరువాయి)

ఒక అంచనాకు వస్తారు రాములవారు. మొదట్లోనే హనుమ సంభాషణ చాతుర్యంలో వలన రాముడు అభిప్రాయాన్ని ఏర్పరచుకుంటాడు. ముందు జరగబోయే వాలి వధ తరువాత కిష్కింధ రాజ్యానికి వారసత్వ విషయంలో, తార అంగదుడు సుగ్రీవునికి పోటీగా రాకుండా చూడడం, అన్వేషణలో వానరులు ముఖ్యంగా అంగదుడు జారి పోకుండా చూడడం, లంకను దాటడంలో అడ్డంకులను అధిగమించే నేర్పరితనం, సీతమ్మతో సంభాషణ, రావణుని హెచ్చరించడం రామునికి సీతమ్మ సందేశం వినిపించడంలో అతడి నేర్పరితనం వీటన్నింటికీ పునాది మనకు ప్రారంభపు సంభాషణల్లోనే కనిపిస్తుంది. ఏడవ సర్గలో రాముడు సుగ్రీవుల మధ్య ఒక చక్కటి సంభాషణ జరిగింది. ఇది సత్పురుషుల మధ్య జరిగే సంభాషణ. సత్పుపురుషులైన వ్యక్తులు తమ కష్ట సుఖాలను పంచుకుంటూ ఓదార్చు కుంటూ ఆశా జనకంగా జరిపిన ఒక సకారాత్మక సంభాషణ. మనకి ఉత్తరకాండలో ఒక చోట వాలి రావణుల మధ్య జరిగిన సంభాషణ కూడా వస్తుంది అది ఇరువురు అహంకారంతో తమ తమ బలపరాక్రమాలని ప్రదర్శిస్తూ చేసుకునే జుగుప్సాకరమైన సంభాషణ.

అలాగే రావణుని చూసీ చూడగానే వాని మీదకు లంఘించి వాడితో యుద్ధం చేసి యుక్తితో తప్పించుకున్న సుగ్రీవునితో నాయనా ఎందుకు ఇంత సాహసం చేశావు నీకేమైనా జరిగితే ఎలా? అనే రీతిలో మాట్లాడతాడు రాముడు. దీని నే సౌశీల్యం అంటారు. “మహద్భిః మందైస్సహ వర్తనం సౌశీల్యం” అనగా ఎంతో గొప్ప వారైనప్పటికీ తమకు ఏరకంగానూ సరితూగని వారితో కూడా అరమరికలు లేకుండా ప్రవర్తించుట మాట్లాడుట అనే గుణం సౌశీల్యం అనబడుతుంది. అంతే కాక మరో సందర్భంలో ‘త్వయి కించిత్ సమాపన్నే సీతయా లక్ష్మణేన వా’ అంటూ తన అభిమానాన్ని చాటుకుంటాడు.





# మార్పు

భీమునిపట్నం గ్రామంలో భీమయ్య అనే తిండిపోతు వుండేవాడు. ఏ పనీ చేయకుండా ఖాళీగా కూర్చుని తింటుండేవాడు. లావుగా వున్న భీమయ్యకు పిల్లనివ్వటానికి ఎవరూ ముందుకు రాలేదు. వాడి తండ్రి రాజయ్య వాడికి ఈ జన్మలో పెళ్ళికాదని దిగులు పడేవాడు.

ఓ రోజు రాజయ్య పట్నం వెళ్ళినప్పుడు తన మిత్రుడైన సుదర్శన్ కు తన కొడుకు విషయం చెప్పాడు. విషయం విన్న సుదర్శన్ భీముణ్ణి బాగుచేస్తానని,తన వద్దకు పంపించు మని చెప్పాడు. మర్నాడు భీమయ్యని సుదర్శన్ వద్దకు పంపాడు రాజయ్య.

సుదర్శన్ ఇంట్లో అతని భార్య ఇద్దరు కుమారులు పని చేయడానికి సూరన్న అని ఒక పనిమనిషి ఉండేవారు. అతని భార్య అందరికీ వంట చేసి పొలం పనులు చూసుకోవడానికి వెళ్ళేది. సూరన్న ఇంట్లో పనులు చూసేవాడు. అతని పెద్ద కుమారుడు సుదర్శన్‌కు సహాయంగా వ్యాపార విషయాలు చూసుకోవడానికి బయటకు వెళ్లేవాడు. చిన్న కొడుకు ఉద్యోగానికి వెళ్లేవాడు. పొద్దంతా ఇంట్లో భీమయ్య ఒక్కడే ఊరికే కూర్చుని ఉండేవాడు. భోజన సమయానికి వచ్చి అందరూ కలిసి భోజనం చేసేవారు. మళ్లీ తిరిగి పనులకు వెళ్లేవారు. అందరూ తినే సమయంలోనే భీమయ్యకు కూడా భోజనం దొరికేది. ఇలా వారం రోజులు గడిచాయి. ఏదో ఒక పని చేస్తూ ఆరోగ్యంగా ఉల్లాసంగా గడిపే వారందరినీ చూసి ఏం చేయాలో తోచక భీమయ్యకు దిగులుగా ఉండేది. అలా గడుస్తుండగా ఒక రోజు భీమయ్యను కూడా పని చేస్తావా అని అడిగాడు సుదర్శన్. ఊరికే కూర్చోవడం అందరూ పనులకు వెళ్లడం చూసి ఏమీ తోచని భీమయ్య ఏదో ఒక పని చేస్తానని చెప్పాడు

వ్యాపారస్తుడైన సుదర్శన్ తనకు బాకీలున్నవారందరి వివరాలు ఇచ్చి బాకీలు వసూలు చేసుకొని రమ్మన్నాడు. ఎన్నడూ ఏ పని చేయటం అలవాటు లేని భీమయ్యకు ఒక్క ఇంటికి వెళ్లడమే కష్టంగా ఉండేది. మర్నాటి నుంచి తోడుగా మరొకరిని పంపించ సాగాడు. కనీసం ఐదు ఇండ్లు తిరిగి వస్తేనే భోజనము పెట్టించే వాడు. బాకీలు వసూలు అయ్యేవరకు తిరగాల్సిందేనని ఖచ్చితంగా చెప్పాడు.



భీమయ్య తన భారీకాయాన్ని ఈడ్చుకుంటూ డబ్బులు వసూలు చేయడానికి వారి వివరాలు తీసుకొని రోజూ బయల్దేరే వాడు. సుదర్శన్ పెట్టింది తినడం, ఉదయం నుండి సాయంత్రం వరకూ తిరగడం. అలసిపోయి సుఖంగా నిద్రించటం మళ్ళీ ఉదయం ఉల్లాసంగా నిద్రలేవటం. భీమయ్యకు దినచర్య ఇలా మారి పోయింది. సుదర్శన్ గంభీరమైన మాటతీరు చూసిన తర్వాత ఎదురు చెప్పే ధైర్యం కూడా లేదు భీమయ్యకు.

ఆరు నెలల జీతం ఒకేసారి తండ్రి అయిన రాజయ్యకే ఇచ్చానని చెప్పి భీమయ్యకి ఒక్క నయా పైసా కూడా ఇచ్చేవాడు కాదు సుదర్శన్. చేతిలో డబ్బు లేకపోవడంతో చిరుతిళ్ళు తినే వీలు కూడా భీమయ్యకి లేకపోయింది.

ఓ ఆరు నెలలు గడిచేసరికి సుదర్శన్ పెట్టిన భోజనం, క్రమశిక్షణతో ప్రొద్దుట్నుంచి రాత్రివరకూ తిరుగుతూ ఉండటంతో సన్నగా తయారయ్యాడు భీమయ్య. తగిన శరీర శ్రమ పద్ధతి గల భోజనం వల్ల ఆరోగ్యంగా ఉన్నాడు. పనిచేయడం వల్ల గౌరవం కూడా దక్కింది. తన శరీరాన్ని, తనలోని మంచి మార్పును చూసుకున్న భీమయ్య సంతోషించాడు. ఇంకెప్పుడూ క్రమశిక్షణ లేకుండా తినకూడదని, శరీరానికి వ్యాయామం తప్పనిసరనే విషయం గుర్తించాడు. ఆ ఊరిలోనే పెళ్లి సంబంధాలు రాసాగాయి భీమయ్యలో వచ్చిన మార్పును చూసి రాజయ్య చాలా సంతోషించాడు.


ఏదీ అతిగా వుండ వద్దు, శరీరానికి వ్యాయామం ఉంటేనే ఆరోగ్యం ఉంటుందని, శ్రమించి జీవిస్తే మంచి ఫలితాలు ఉంటాయని తన తోటి వారికి భీమయ్య చెప్పటం కూడా ప్రారంభించాడు.

PRAPATTI SRISANNIDHANAM Telugu Monthly APR 2024 RNI NO : TELTEL12303

# శ్రీసన్నిధి పదకేళి 2

## ఆధారాలు నిలువు:

1. మొల్ల రామాయణంలో కథానాయకుడు (4)
2. రావణాసురుని భార్య? (4)
3. ద్రోణాచార్యుని వంచనకు గురైన శిష్యుడు? (5)
4. బాసరలో ప్రసిద్ధి చెందిన దేవాలయం? (4)
5. ఏప్రిల్ 17 2024 వచ్చే పండుగ (6)




## ఆధారాలు అడ్డం:

5. ఏడుకొండలవాడు (5)
6. నూతన సంవత్సరాది పేరు (2)
7. తెలుగు నెలల్లో మొదటిది (2)
8. ఒక దానికి ఒకటి తాకితే వచ్చేది (2)
9. సుమిత్రకు సీతాదేవికి ఏమౌతుంది (2)
10. రాశులు ఎన్ని (3)
11. శ్రీసన్నిధానం పత్రికలో పిల్లల కథల శీర్షిక పేరు. (5)
12. కురుక్షేత్రంలో తొలిరోజే మరణించిన ఉత్తరుడు ఎవరి కొడుకు? (5)
13. భీష్ముని దగ్గరికి శిఖండి రూపంలో వచ్చింది? (2)

## పోటీలో పాల్గొనండి!

## ఉచిత పత్రిక అందుకోండి!!

ఈ పదకేళిలో సరియైన సమాధానాలు వ్రాసి మాకు వాట్సప్ ద్వారా పంపించండి.
ఫలితాలతో ఆ నెల సంచికలో మీ పేరుతో పాటు మీరు పంపే అడ్రసుకు ప్రత్యక్షంగా ఆ నెల పత్రిక ఉచితంగా మీకు అందిస్తాము.
సరియైన జవాబులు 9502583323 వాట్సప్ ద్వారా పంపండి.

Printed & Edited and Published by DINGIRI SRINIVASA MURTHY on behalf of SRISANNIDHANAM CHARITABLE TRUST and Published at H.No 10-2-225, Vidhyanagar, Karimnagar, Telangana - 505 001
Editor DINGIRI SRINIVASA MURTHY, RNI Title No TELTEL12303, Cell No : 9502583323, Land line No 0878-2253323
Email Id prapatti.srisannidhanam9@gmail.com.